

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 09-04-2026 | సంపుటి - 27 | సంచిక -317 | రూ : 4 | పేజీలు: 8




## విద్యాభివృద్ధికి
# 3 కంపెనీల నుంచి రూ.110 కోట్లు

- ప్రాధాన్యత రంగాల ఎంపిక - ప్రభుత్వ సహకారం
- స్థానిక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట
- విద్యపై పెట్టుబడి - భవిష్యత్ తరాల నిర్మాణం
- ప్రపంచస్థాయి నైపుణ్యం - కంపెనీల భాగస్వామ్యం

2లో

## నాదర్‌గూల్ భూములపై హరీశ్‌కు
# పొంగులేటి కౌంటర్

- బీఆర్ఎస్ హయాంలోనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగిందన్న మంత్రి
- హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022 లోనే నిర్మాణాలు ప్రారంభమైనట్లు వెల్లడి
- ఇది ప్రభుత్వ భూమి అని కేసీఆర్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయలేదన్న మంత్రి



2లో



## హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం
# ముగ్గురు మృతి

- సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద రోడ్డు ప్రమాదం
- నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న ఇద్దరిని ఈడ్చుకెళ్లిన కారు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

2లో




# భారత్‌లో తీవ్ర అసమానతలు

- సంక్షోభంలో పేదలు.. సంపాదనలో పెద్దలు
- మోడీ పదేండ్ల పాలనలో సామాన్యుడి దుస్థితి
- 1688 మందికి రూ.1000 కోట్లకు పైగా ఆస్తులు
- అతి సంపన్నులపై పన్నులు విధించాలి
- అది సామాజిక సంక్షేమానికి ఉపయోగకరం
- 'వెల్త్ ట్రాకర్ ఇండియా 2026' నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : మోడీ పాలనలో గత దశాబ్ద కాలంలో భారత్‌లో అసమానతలు తీవ్రంగా పెరిగాయి. పేదలు సంక్షోభాన్ని ఎందుర్కొంటున్నారు. మరోపక్క ధనికుల సంపద మాత్రం గణనీయంగా పెరిగింది. తాజా 'వెల్త్ ట్రాకర్ ఇండియా 2026' నివేదిక ఈ అసమానతను స్పష్టంగా చూపిస్తోంది. అయితే

తరువాయి 2లో

## రెవెన్యూ శాఖపై బాబు సమీక్ష
# లక్షల కుటుంబాలకు లబ్ధి!



2లో

- అ రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా కీలక నిర్ణయాలు
- 1.37 లక్షల ఎకరాల ఇనాం భూములకు 22ఏ నుంచి విముక్తి
- 2016 ముందునాటి ప్రభుత్వ గృహ పట్టాలకు రిజిస్ట్రేషన్ సాకర్యం
- 2027 మార్చి నాటికి రీ-సర్వే 2.0 పూర్తి చేయాలని ఆదేశం

## శాంతి ఒప్పందం వేళ..
# ఇరాన్ ఆయిల్ రిఫైనరీపై దాడి

- లావన్ ద్వీపంలోని చమురు శుద్ధి కేంద్రాన్ని శత్రువులు లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడి
- ఈ దాడిని పరికిపంద చర్యగా అభివర్ణించిన ఎన్ఐఓఆర్డీసీ
- ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని స్పష్టీకరణ



2లో




2లో

## హైడ్రా పనితీరుకు జాతీయ ఖ్యాతి..
# చెన్నైలోనూ అమలుకు సీఎండీఏ ఆసక్తి!

- హైడ్రా పనితీరుపై చెన్నై మెట్రోపాలిటన్ అథారిటీ ప్రశంసలు
- చెన్నైలో వరదల నివారణకు హైడ్రా మోడల్‌పై అధికారుల ఆసక్తి
- అమీర్‌పేట, ప్యాట్నీ నాలాల విస్తరణ పనుల పురోగతిని చెన్నై అధికారులకు వివరించిన రంగనాథ్
- ఖానామెట్‌లో తాజాగా రూ.1200 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

# రేపే ముక్కోణపు పోరు
## కేరళ, అసోం, పుదుచ్చేరిలో పోలింగ్

- అసోం, కేరళ, పుదుచ్చేరిలో గురువారం ఒకే విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగం
- అసోంలో వరుసగా మూడోసారి గెలుపుపై బీజేపీ ధీమా
- కేరళలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని పినరయి విజయన్ సర్కార్ పోరాటం
- పుదుచ్చేరిలో ఐదోసారి సీఎం పీఠంపై ఎన్. రంగస్వామి కన్ను

2లో



# భారత్‌లో తీవ్ర అసమానతలు

న్యూఢిల్లీ : మోడీ పాలనలో గత దశాబ్ద కాలంలో భారత్‌లో అసమానతలు తీవ్రంగా పెరిగాయి. పేదలు సంక్షోభాన్ని ఎందుర్కొంటున్నారు. మరోపక్క ధనికుల సంపద మాత్రం గణనీయంగా పెరిగింది. తాజా 'వెల్త్ ట్రాకర్ ఇండియా 2026' నివేదిక ఈ అసమానతను స్పష్టంగా చూపిస్తోంది. అయితే సంపన్నులపై పన్నులు విధిస్తే అది సామాజిక సంక్షేమానికి ఉపయోగపడుతోందని కూడా సూచిస్తోంది.

**తీవ్ర ఇబ్బందుల్లో పేద, మధ్య తరగతి**

కేంద్రంలోని మోడీ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పెద్ద నోట్ల రద్దు సమయంలో ప్రజలు బ్యాంకుల ముందు క్యూలలో నిలబడ్డారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో అసంఘటిత రంగ కార్మికులు నగరాల నుంచి గ్రామాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికీ పరిస్థితి మారలేదు. ధరలు పెరగడం, వేతనాలు స్థిరంగా ఉండటం వల్ల ప్రజలు అప్పుల్లో కూరుకుపోయారు. ఇప్పుడు మధ్యప్రాచ్య యుద్ధ ప్రభావంతో ఎల్పీజీ కొరత ఏర్పడింది. దీంతో గృహిణులకు ఇబ్బందులు తప్పటం లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు మళ్లీ కష్టాల్లో పడిపోయారు. ముఖ్యంగా నగరాల్లో పని చేసే వలసకార్మికుల వారి గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలకు 'సహించాలి' అంటూ సలహానే ఇస్తోంది. తక్షణ సమస్యలకు పరిష్కార కోరవద్దనీ, దీర్ఘకాల ప్రయోజనాల కోసం కష్టాలను భరించాలని దేశ ఆర్థిక సలహాదారు సూచిస్తుండటం గమనార్హం.

**'క్యాపిటల్ ఫ్లైట్' భయం**

దేశంలోని అతి సంపన్నులపై పన్ను వేస్తే వారు దేశం వదిలి వెళ్లిపోతారని ఒక వాదన ఉంది. దీనిని నివేదిక 'భయపెట్టే కథ'గా అభివర్ణించింది. భారత్‌లో కంపెనీల లాభాలు పెరిగినా, ఉద్యోగాలు పెరగడం లేదు. వేతనాలు కూడా పెరగడం లేదు. పరిశోధన, అభివృద్ధిపై ఖర్చు జీడీపీలో 0.6 శాతం మాత్రమే. అంటే ధనికులు తమ లాభాలను దేశ అభివృద్ధికి వినియోగించడం లేదని నివేదిక వివరిస్తోంది. అతి సంపన్నులపై పన్ను వేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు లాభం కలుగుతోందని సూచిస్తోంది.

**సంపన్నులపై పన్నులు అవసరం**

ఈ నివేదిక ప్రకారం... అత్యంత ధనికులపై తక్కువ శాతం పన్ను విధించినా భారీ మార్పులు సాధ్యమవుతాయి. ఉదాహరణకు, ముఖేశ్ అంబానీ సంపదపై రెండు శాతం పన్ను వేస్తే.. దేశంలోని ప్రతి పదో తరగతి విద్యార్థికి మూడు సంవత్సరాల పాటు ఉచిత ల్యాప్‌టాప్ ఇవ్వవచ్చు. అలాగే గౌతమ్ అదానీ సంపదపై పన్ను వేస్తే.. దేశ ప్రజలకు రెండు ఏండ్ల పాటు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించొచ్చు.

## నాదర్గుల్ భూములపై
# హరీశ్ కు పొంగులేటి కౌంటర్

హైదరాబాద్, ఏప్రిల్ 08 :నాదర్‌గుల్‌లో భూములను 2014లోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంస్థలకు అప్పగించిందని, వారి హయాంలోనే ఆ సంస్థల పేరిట రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. నాడు జరిగిన రిజిస్ట్రేషన్‌తో తమ ప్రభుత్వానికేం సంబంధమని మండిపడ్డారు. నాదర్‌గుల్ భూములను తమ ప్రభుత్వం హయాంలో కట్టబెట్టినట్లు ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. తమకు నాలా కన్వర్షన్ ఇవ్వలేదని భూములు పొందినవారు 2022లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆ భూములు ప్రభుత్వానివేనని కౌంటర్ దాఖలు చేశామని వెల్లడించారు. నాడు వాటాల కోసం భూములు కట్టబెట్టిన వారు ఇప్పుడు తమపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారానికి సంబంధించిన కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. కాగా, నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై ఇటీవల రాజకీయ దుమారం చెలరేగుతోంది. రూ.7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టిందని హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. అయితే ఈ భూమి యజమాని ఏక్యూ రియాల్టర్ అని చెబుతున్నారు. ఇది ప్రైవేటు భూమి అని హైకోర్టు, సుప్రీంకోర్టు గుర్తించాయని ఏక్యూ రియాల్టర్ అడ్వకేట్ ఇటీవల తెలిపారు.

# విద్యాభివృద్ధికి 3 కంపెనీల నుంచి రూ.110 కోట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 08 : కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధుల వినియోగంపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజాభివృద్ధికి చేసే వ్యయాన్ని కేవలం ఒక 'ఖర్చు'గా కాకుండా, ప్రభుత్వంతో కలిపి చేసే 'భాగస్వామ్యం'గా చూడాలని కార్పొరేట్ సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్ఆర్ నిధుల వినియోగంపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, కార్పొరేట్ సంస్థల పాత్రను ఆయన వివరించారు.

**ప్రాధాన్యత రంగాలను మీరే ఎంచుకోండి**

కంపెనీలు సీఎస్ఆర్ కింద చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం ప్రధానంగా విద్య, వైద్యం, జల వనరుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సీఎం స్పష్టం చేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఆసక్తి ఉన్న ఏ రంగాన్నైనా (నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ తదితరాలు) ఎంచుకుని సీఎస్ఆర్ నిధులను వినియోగించవచ్చని సూచించారు. ఏ రంగాన్ని ఎంచుకున్నా ప్రభుత్వం తరఫున అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కంపెనీలు స్థానికంగా ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున, తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ భాగాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలని కోరారు.

**భవిష్యత్ తరాలపై పెట్టుబడి.. విద్యే**

విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "రాష్ట్రంలోని మొత్తం విద్యార్థుల్లో 44 శాతం మంది హైదరాబాద్ నగరంలోనే ఉన్నారు. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది. ప్రభుత్వంతో పాటు కంపెనీలు భాగస్వామ్యమై చేసే వ్యయంతో.. తెలంగాణ విద్యార్థులను ప్రపంచస్థాయి నైపుణ్యం ఉన్నవారిగా తీర్చిదిద్దగలం. తద్వారా వారు భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకునేలా తయారు చేయవచ్చు" అని ముఖ్యమంత్రి వివరించారు.

**సీఎస్ఆర్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి**

సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం, పర్యవేక్షణ లేనందున.. తమ ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టిందని సీఎం తెలిపారు. ఈ నిధుల సమన్వయం కోసం ప్రత్యేకంగా ఒక ప్రధాన కార్యదర్శి (Principal Secretary) స్థాయి అధికారిని నియమించినట్లు వెల్లడించారు. కంపెనీల ప్రతినిధులు ఈ అధికారితో సమన్వయం చేసుకుని పనులు చేపట్టవచ్చని సూచించారు.

* **ముందుకొచ్చిన దిగ్గజ సంస్థలు.. సీఎం అభినందనలు**

విద్యాభివృద్ధికి తమ వంతు సాయంగా సీఎస్ఆర్ నిధులను కేటాయించేందుకు పలు దిగ్గజ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

## హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం
# ముగ్గురు మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 08 :హైదరాబాద్‌లోని సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో హోండా కారును వేగంగా నడిపిన ఒక డ్రైవర్, రోడ్డు మీద నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న మరో ఇద్దరు యువకులను ఢీకొట్టి 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుని వెళ్లాడు. ఆ తర్వాత కారు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచి వెళుతున్న యువకుడు కూడా ఈ ఘటనలో మృతి చెందాడు. కాలేజీ విద్యార్థులు కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

# రేపే ముక్కోణపు పోరు
# కేరళ, అసోం, పుదుచ్చేరిలో పోలింగ్

ఢిల్లీ, ఏప్రిల్ 08 : దేశవ్యాప్తంగా రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తున్న అసెంబ్లీ ఎన్నికల పర్వంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రేపు (ఏప్రిల్ 9) గురువారం నాడు రెండు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. అసోం, కేరళ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంత ప్రజలు తమ తీర్పును ఇవ్వనున్నారు. మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలు ప్రాంతీయ, జాతీయ పార్టీలకు ఒక అగ్నిపరీక్షగా మారనున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో పాటు ఈ ఎన్నికల ఫలితాలను కూడా మే 4వ తేదీన ప్రకటించనున్నారు.

**అసోం**

అసోంలోని మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే కూటమిలో భాగంగా బీజేపీ వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పట్టుదలగా ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి సారథ్యం వహిస్తున్నారు. 20162021 మధ్యకాలంలో శర్బానంద సోనోవాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ నేతృత్వంలో పునరుజ్జీవం కోసం ప్రయత్నిస్తోంది. ఆరు పార్టీలతో కూటమి ఏర్పాటు చేసి బరిలోకి దిగుతోంది. అఖిల్ గొగోయ్‌కు చెందిన రైజోర్ దళ్, లురిన్‌జ్యోతి గొగోయ్ నేతృత్వంలోని అసోం జాతీయ పరిషత్ ఈ కూటమిలో కీలక పార్టీలుగా ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 2.5 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో దాదాపు సమానంగా 1.25 కోట్ల మంది పురుషులు, మహిళలు ఉన్నారు. అలాగే 318 మంది ట్రాన్స్‌జెండర్లు, 1819 ఏళ్ల మధ్య వయసున్న 6.42 లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు.

**కేరళ**

దేశంలో కమ్యూనిస్టులకు చివరి కంచుకోటగా ఉన్న కేరళలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు సీపీఎం నేత, ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. గత నాలుగు దశాబ్దాలుగా కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వస్తున్నాయి. అయితే, 2021లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) వరుసగా రెండోసారి గెలిచి ఈ సంప్రదాయానికి తెరదించింది. ఇంతకుముందు ఎల్‌డీఎఫ్ 1980, 1987, 1996, 2006, 2016లో అధికారంలోకి వచ్చింది. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఈసారి ఎలాగైనా తిరిగి అధికార పగ్గాలు చేపట్టాలని భావిస్తోంది. ఈ కూటమి 1982, 1991, 2001, 2011లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. కేరళలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.39 కోట్ల మంది మహిళలు, 1.32 కోట్ల మంది పురుషులు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 4.66 లక్షల మంది యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు.

**పుదుచ్చేరి**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్సీ) అధినేత, ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రి పీఠంపై కన్నేశారు. కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన 76 ఏళ్ల రంగస్వామి, 1990లలో మంత్రిగా పనిచేశారు. 2001లో తొలిసారి, 2006లో రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్‌తో విభేదాల కారణంగా 2008లో వైదొలిగి, సొంతంగా ఏఐఎన్ఆర్సీ పార్టీని స్థాపించారు. 2011లో మళ్లీ గెలిచి మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 20162021 మధ్య ప్రతిపక్ష నేతగా వ్యవహరించి, 2021లో ఎన్డీయే కూటమిలో భాగంగా నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఇక్కడ మొత్తం 9.44 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 5 లక్షల మంది మహిళలు, 4.43 లక్షల మంది పురుషులు, 139 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 23,033 మంది యువత తొలిసారి ఓటు వేయనున్నారు.

## శాంతి ఒప్పందం వేళ..
# ఇరాన్ ఆయిల్ రిఫైనరీపై దాడి

టెహ్రాన్/కువైట్ సిటీ: కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినట్లు వార్తలు వెలువడిన కొన్నిగంటలకే, లావన్ ద్వీపంలోని ఆయిల్ రిఫైనరీపై దాడి జరిగినట్లు ఇరాన్ తెలిపింది. ఇక్కడి చమురు శుద్ధి కేంద్రాన్ని శత్రువులు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. టెహ్రాన్ కూడా ప్రతీకార దాడులు నిర్వహించింది. యూఏఇ, కువైట్‌లపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడింది. నేషనల్ ఇరానియన్ ఆయిల్ రిఫైనింగ్ అండ్ డిస్ట్రిబ్యూషన్ (ఎన్ఐఓఆర్డీసీ) కంపెనీ లావన్‌పై దాడిని ధృవీకరించింది. ఈ దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించింది. చెలరేగిన మంటలను అదుపు చేయడానికి వెంటనే భద్రతా మరియు అగ్నిమాపక సిబ్బంది బృందాలు రంగంలోకి దిగాయి. క్షేత్రస్థాయిలోని సిబ్బందిని సకాలంలో తరలించడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ఎన్ఐఓఆర్డీసీ తెలిపింది. ఇరాన్ జాతీయ ఇంధన సరఫరా మరియు పంపిణీలో ఎలాంటి ఇబ్బంది లేదని ఎన్ఐఓఆర్డీసీ స్పష్టం చేసింది. అయితే పౌరులు ఇంధన వినియోగాన్ని నియంత్రించుకోవాలని, అనవసర ప్రయాణాలను నివారించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని కోరింది. కువైట్‌లోని పలు చమురు, విద్యుత్ క్షేత్రాలపై దాడులు జరిగాయి. దాదాపు 28 ఇరాన్ డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుందని కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. చమురు శుద్ధి కేంద్రాలు, విద్యుత్ ప్లాంట్లపై డ్రోన్ దాడులు జరగడంతో భారీ నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. యూఏఈలోని కొన్ని ప్రాంతాలపై కూడా క్షిపణి దాడులు జరిగాయి.

## రెవెన్యూ శాఖపై బాబు సమీక్ష.. లక్షల కుటుంబాలకు లబ్ధి!

అమరావతి, ఏప్రిల్ 08 : రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు భూ సమస్యల నుంచి విముక్తి కల్పిస్తూ, వారి ఆస్తులకు పూర్తి భద్రత కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. దశాబ్దాలుగా నలుగుతున్న అనేక రెవెన్యూ వివాదాలకు చరమగీతం పాడుతూ, ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలకు లబ్ధి చేకూర్చేలా ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక అడుగులు వేసింది. బుధవారం సచివాలయంలో రెవెన్యూ శాఖపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో, లక్షలాది కుటుంబాలకు వరంగా మారే కీలక ఆదేశాలు జారీ చేశారు.

**రీసర్వే 2.0కు పక్కా ప్రణాళిక**

గత ప్రభుత్వ హయాంలోని రీసర్వే అస్తవ్యస్తంగా మారిందని, దానిని సరిదిద్దేందుకు 'రీసర్వే 2.0'ను పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. 2027 మార్చి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, రాష్ట్రంలోని 1.12 కోట్ల మంది రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు సర్వే పూర్తయిన 6,976 గ్రామాల్లో 5,717 గ్రామాలకు సంబంధించి 22.79 లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరుగుతోందని అధికారులు వివరించారు. మిగిలిన 1,259 గ్రామాల్లోని 9 లక్షల పాసు పుస్తకాలను ఈ ఏడాది జూలై నాటికి అందించాలని సీఎం ఆదేశించారు. ఆ తర్వాత వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 80 లక్షల పాసు పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలని గట్టిగా సూచించారు.

**ఇనాం భూములకు విముక్తి**

రాష్ట్రంలో ఏళ్ల తరబడి సంక్లిష్టంగా మారిన ఇనాం భూముల సమస్యకు చంద్రబాబు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను నిషేధిత ఆస్తుల జాబితా (22ఏ) నుంచి తొలగిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు ఇతర సర్వీస్ ఇనాంల పరిధిలోని మరో లక్ష ఎకరాల భూములకు కూడా విముక్తి కల్పించేందుకు వీలుగా కొత్త చట్టం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

## హైడ్రా పనితీరుకు జాతీయ ఖ్యాతి..
# చెన్నైలోనూ అమలుకు సీఎండీఏ ఆసక్తి!

హైదరాబాద్, ఏప్రిల్ 08 : హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, నాలాల పునరుద్ధరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) పనితీరు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. హైదరాబాద్ నగరంలో హైడ్రా చేపడుతున్న చర్యలను ఆదర్శంగా తీసుకుని, తమ నగరంలో వరదల నివారణకు వినియోగించుకోవాలని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు సీఎండీఏ ఉన్నతాధికారుల బృందం ఒకటి హైదరాబాద్‌లో పర్యటించి, హైడ్రా కార్యకలాపాలను అధ్యయనం చేసింది. ఈ ప్రశంసలకు తగ్గట్టుగానే హైడ్రా తన దూకుడును కొనసాగిస్తూ నగరంలో మరో భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో రూ.1,200 కోట్ల విలువైన 8 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఖానామెట్‌లోని సర్వే నంబర్ 55లో ఉన్న ఈ అత్యంత విలువైన భూమిని కొన్ని ప్రైవేటు నిర్మాణ సంస్థలు ఆక్రమించుకుని, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టాయి. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్నారు. వెంటనే అక్కడి తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేసి, స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆ భూమి చుట్టూ కంచె వేసి, ప్రభుత్వ ఆస్తి అని సూచించే బోర్డులను ఏర్పాటు చేశారు.

**నాలాల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి**

ఇటీవల చెన్నై నుంచి వచ్చిన సీఎండీఏ అధికారుల బృందం హైడ్రా పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిసింది. ముఖ్యంగా నాలాలు, చెరువుల పునరుద్ధరణలో హైడ్రా అనుసరిస్తున్న వ్యూహాలపై వారు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వారికి అమీర్‌పేట, ప్యాట్నీ నాలాల విస్తరణ పనుల పురోగతిని, వాటి ద్వారా వరద ముప్పును తగ్గించే ప్రణాళికలను వివరించినట్లు సమాచారం. హైడ్రా పనితీరు అద్భుతంగా ఉందని, ఈ మోడల్‌ను చెన్నైలో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని సీఎండీఏ బృందం కొనియాడినట్లు తెలిసింది. 2024లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా అనతికాలంలోనే తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. చెరువులు, పార్కులు, నాలాలతో పాటు విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు కవచంలా నిలుస్తోంది.

# ఘనంగా వెంకటేశ్వర బస్తి హిందూ సమ్మేళనం

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ పట్టణం,వెంకటేశ్వర కాలనీలో వెంకటేశ్వర దేవాలయం, పద్మావతి పార్కులో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించామని సమ్మేళన సమితి అధ్యక్షుడు.లకుమారపు శ్రీనివాస్ తెలిపారు , కార్యక్రమంలో పూజ్యశ్రీ నారాయణ స్వామీజీ విశిష్ట అతిథి మేడిపల్లి యాదన్ కుమార్ లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కులం ఉన్నప్పటికీ, మనమందరం హిందువులుగా సామాజిక సమరసతతో కలిసిమెలిసి ఉండాలని, మన



దేవాలయాలకు, ఏదైనా సమస్య వచ్చినప్పటికీ మనమందరం కలిసికట్టుగా పోరాడాలని, మన హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని అన్నారు. మహిళా వక్త శ్రీమతి కల్లెం స్వప్న మాట్లాడుతూ మన వేషధారణ, మన కుటుంబ విలువలను మన పిల్లలకు మన సనాతన ధర్మం పట్ల అవగాహన కల్పించాలని అన్నారు, ముఖ్య వక్త అప్పల ప్రసాద్ మాట్లాడుతూ గడప లోపల కులం గడప దాటి తే హిందువులుగా ఉండాలని,మనమంతా భారతీయులమని,మనపిల్లలకు చిన్నప్పటి నుండే కుటుంబ విలువలను నేర్పాలని,మాతృ భాషను నేర్పించాలని,ప్రేమ పేరుతోటి మన హిందూ అమ్మాయిలను అపహరించి తీసుకుపోతున్నారని, వాళ్లను తీసుకెళ్లి అమ్మేస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. మన పిల్లలను చదువు ఒక్కటే కాకుండా సంస్కృతి కూడా నేర్పియాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గార్లపాటి వెంకటయ్య,ఇటిక్యాల కృష్ణయ్య, నన్నూరి రాంరెడ్డి, నూకల జయపాల్ రెడ్డి, నరేందర్ రావు,గుర్రం వెంకటేశ్వర్లు, మందడి వెంకటరెడ్డి,నాగులపల్లి శ్యాంసుందర్,రమాదేవి,మేడం ప్రాభాకర్,పిల్లి కృష్ణ,నూనె మాధవి,తొగోటి రమేష్,ఆవుల వెంకన్న,సముద్రాల శ్రీనివాస్,బండారు అంజమ్మ,ఇంద్రకంటి ఇంద్రా రెడ్డి,ఊటుకూరి యాదగిరిరెడ్డి,కళారాణి,మల్లేష్,జిగినీ కృష్ణయ్య కాలనీ వాసులు,మహిళలు కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు..ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం,చిన్నారులచే సాంస్కృతిక ప్రదర్శనలు,కోలాట ప్రదర్శనలు చేశారు. చివరగా ప్రసాద వితరణ నిర్వహించారు.

## మద్యం తాగి వాహనం నడిపితే పదివేల ఫైన్





హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే పదివేల రూపాయల జరిమానా విధించబడుతుందని హుస్నాబాద్ ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వర్లు వాహనదారులకు హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలపై ఆయన బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలకు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని లైసెన్స్ లేని వారు లైసెన్స్ తీసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయన్నారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 12న హిందూ మహా సమ్మేళనంను విజయవంతం చేయండి



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 12న ఆదివారం సాయంత్రం ప్రగతి నగర్ లో జరిగే హిందూ మహా సమ్మేళనంలో హిందూ బంధువులందరూ పాల్గొని విజయవంతం చేయాలని అయోధ్య రామ హిందూ సమ్మేళన సమితి నిర్వహకులు పిలుపునిచ్చారు. బుధవారం మిథిలా నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హిందూ మహా సమ్మేళనం కు సంబంధించిన బ్యానర్లను ఆవిష్కరించారు. పర్యావరణ హితంగా ఉండేటట్లు ప్లాస్టిక్ వాడకుండా సిరిసిల్లా నుంచి ప్రత్యేకంగా బట్టతో తయారు చేయించి తెప్పించిన క్లాత్ బ్యానర్లుకు పూజలు నిర్వహించి విడుదల చేశారు. ఈ ఆహ్వాన బ్యానర్లను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నామని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో అయోధ్య రామ హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి సాంబశివరావు, కోశాధికారి లక్ష్మీ రామారావు, సలహాదారు ప్రొఫెసర్ చంద్రమౌళి, వ్యవస్థా ప్రముఖ్ చెన్నారెడ్డి, ప్రతినిధులు ఠాగూర్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డికి సన్మానం



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా, బయ్యారం సొసైటీ మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డిని జిల్లా కార్యదర్శిగా నియమించిన శుభ సందర్భంగా వారి నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువతో సత్కరించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాచనపల్లి గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పర్షిక రాజు, బానోత్ రాంబాబు, ఎస్.కె యూసఫ్, బచ్చల వెంకటేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## వైభవంగా ఎల్లమ్మ తల్లికి బోనాలు



అందోలు, ప్రజాస్ఫూర్తి : అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలలో భాగంగా బుధవారం ఎల్లమ్మ తల్లికి బోనాల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తుల కుల దేవతకు ఇంటింట బోనాలను సమర్పణలో భాగంగా ఇంటింట బోనాల కార్యక్రమాన్ని చేపట్టారు. గౌడ మహిళలు బోనాలను ఎత్తుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు బయలుదేరారు. శేరి మాల్లారెడ్డిపల్లి గౌడ కులస్తులు, కన్‌సాన్‌పల్లి గౌడ కులస్తుల బోనాలు ఒకచోటికి చేరుకొని ఊరేగింపుగా వెళ్లారు. బోనాల ఊరేగింపు డప్పు చప్పుల్లు, డోలు వాయిద్యాల మధ్య శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్య బోనాల శోభాయాత్ర ఆలయం వరకు సాగింది. బోనాల ఊరేగింపు సమయంలో మహిళలు దారి పొడువున బోనాల ఊరేగింపుకు నీళ్లతో సాకలు పెట్టి మంగళహారతులతో స్వాగతం పలికారు. బోనాల ఉత్సవాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో పండగ వాతావరణం నెలకొంది. చిన్నారుల , యువకులు కేరింతలు, రంగురంగుల టపాసుల చప్పుడులతో గ్రామ వీధుల్లో కోలాహలంగా సాగింది. అనంతరం బోనాలలో నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ వార్షికోత్సవాలలో భాగంగా గురువారం ఉత్సవాలలో భాగంగా అమ్మవారి కళ్యాణాన్ని నిర్వహించనున్నారు. ఇట్టి కళ్యాణ మహోత్సవానికి భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు తెలిపారు.

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తీర్పు వాయిదా

హైదరాబాద్: జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదనలు విన్నది. బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

*** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చెల్కలో కోటి 91 లక్ష రూపాయల వ్యయంతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రోగుల సంఖ్య విపరీతంగా పెరిగి పోవడాన్ని దృష్టిలో ఉంచుకొని మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ నిధులతోపాటు, ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 50 లక్షల రూపాయల వ్యయంతో అవసరమైన మౌలిక సదుపాయాలు, డాక్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాన్యం చెల్క యు పిహెచ్ సి కి నూతన భవనాన్ని నిర్మించడమే కాకుండా, అవసరమైన మెడికల్ సామాగ్రిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంకా అవసరమైతే ఎక్కువ ఎక్విప్మెంట్ సమకూరుస్తామన్నారు. చుట్టుపక్కల ప్రజలు ,పెద్దవారు గర్భిణీ స్త్రీలకు, మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనువుగా ఉంటుందని ఇక్కడే అన్నిరకాల వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్షలతో పాటు, అవసరమైతే ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి రిఫర్ చేసే విధంగా వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. కార్పొరేటర్లు వివిధ రకాల జబ్బులతో బాధపడే ప్రజలను గుర్తించి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని చెప్పారు. నల్గొండ కార్పొరేషన్ అయినందున సిసి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, మంచి వైద్య సదుపాయాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్ , ఎల్వీ ప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో మూడెకరాల స్థలంలో కంటి ఆసుపత్రిని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.అనుకోకుండా పట్టణ పి హెచ్ సి లో మందులు అందుబాటులో లేకుంటే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒక ప్రయివేట్ మెడికల్ షాపును గుర్తించి అవసరమైన అత్యవసర మందులు అందజేసే విధంగా అనుసంధానం చేశామని తెలిపారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు ఇవ్వడం జరుగుతుందని, ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. అవసరమైతే మాన్యం చెల్కపట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అక్షయ ఫౌండేషన్ సహకారంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఆహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. మాన్యం చెల్క చౌరస్తా సుందరీకరణతో పాటు, విస్తరించి తీర్చిదిద్దడం జరుగుతున్నదని తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాన్యం చెల్క తో పాటు, చుట్టుపక్కల వార్డుల ప్రజలకు పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. డాక్టర్లు పేద ప్రజల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వైద్యం అందించాలని కోరారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ విద్యతోపాటు, పేద ప్రజలకు వైద్యం అందించేందుకు మంత్రి చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ అమీర్ అలీ ,ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నరసింహారావు నేత, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా టీబి నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, యు పి హెచ్ సి డాక్టర్లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


## దిశా సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష

*** తాగునీరు, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**
*** ఖమ్మం ఎంపీ రామసహాయం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో దిశా సర్వసభ్య సమావేశం బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జరిగింది. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి అధ్యక్షత వహించగా, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ సహాధ్యక్షులుగా పాల్గొన్నారు. కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ,కోరం కనకయ్య,పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకటరావు, మేయర్ మూడ్ గణేష్ తదితరులు హాజరయ్యారు.గత సమావేశ నిర్ణయాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేసి, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఎంపీ రఘురామరెడ్డి అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర నిధుల తగ్గింపుతో రాష్ట్రంపై భారం పెరిగిందని తెలిపారు. గృహ నిర్మాణంలో మార్పుల వల్ల పేదలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, వైద్యం, విద్యుత్ సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, అంబులెన్స్, డయాలసిస్ సేవలు మెరుగుపరచాలని ఆదేశించారు. మిషన్ భగీరథ, అమృత్ పథకాల పనులు వేగవంతం చేసి పైప్‌లైన్ లీకేజీలను నివారించాలని చెప్పారు. జాతీయ రహదారులు, ఆర్&బీ, విద్యుత్ పనుల ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. ఐటీడీఏ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిధులను సమర్థంగా వినియోగించాలని పేర్కొన్నారు.ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ కేంద్ర పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని అన్నారు. మారుమూల ప్రాంతాలకు తాగునీరు, ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

## ఘనంగా టీబీబీ రంబుల్ వార్షికోత్సవం



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ బైకర్స్ బ్రదర్‌హుడ్ తమ తొలి వార్షికోత్సవాన్ని "టీబీబీ రంబుల్ 2026" పేరుతో హైదరాబాద్ సమీపంలోని ఓ రిసార్ట్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో 170 మంది బైకర్లు కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అవార్డులు, సంగీతం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీఐ బద్యా నాయక్, ఎస్ఐ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై బైకర్స్ తీసుకోవాల్సిన జాగ్రత్త లు వివరించారు. టీబీబీ క్లబ్ స్థాపకుడు ఫణీంద్ర కుమార్ అదేపు, సహ స్థాపకుడు ఆశిష్ రంగ్ మాట్లాడుతూ సేఫ్ రైడింగ్, "నో డ్రగ్స్" అవగాహనపై దృష్టి పెట్టామని తెలిపారు.కేవలం 6 మందితో ప్రారంభమైన ఈ క్లబ్, ఏడాదిలో 600 మంది సభ్యులకు చేరుకుని వేగంగా ఎదుగుతోందన్నారు. ప్రతి ఆదివారం రైడ్స్ నిర్వహిస్తూ మహిళా రైడర్ల భాగస్వామ్యాన్ని కూడా ప్రోత్సహిస్తుందని తెలిపారు.కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతం చేసి, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దిశా సమావేశ నిర్ణయాలను ప్రాధాన్యంగా తీసుకుని అమలు చేయాలని సూచించారు.ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పథకాల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు కోరారు. ఈ సమావేశంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, అశ్వరావుపేట మున్సిపల్ చైర్ పర్సన్ శశికళ, డి ఆర్ డి ఓ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు, దిశా కమిటీ సభ్యులు బుర్ర సురేష్, యేసుమని, స్వర్ణ జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీటెక్ విద్యార్థుల మృతి

హైదరాబాద్: సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మద్యం మత్తులో కారు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఓ వ్యక్తి.. ద్విచక్ర వాహనాన్ని, నడిచి వెళ్తున్న మరో యువకుడిని ఢీకొట్టాడు. వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లి కారు పల్టీ కొట్టింది. ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచివెళ్తున్న మరో యువకుడి గాయాలయ్యాయి. కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హక్కుల రక్షణ కోసమే డి ఎచ్ పి ఎస్



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలు, హత్యాచారాలపై దళిత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురైతున్నారని, వారి హక్కుల రక్షణ కోసం దండు గట్టి పోరాడటమే దళిత హక్కుల పోరాట సమితి(డి.ఏచ్.పి. ఏస్)లక్ష్యం అని జిల్లా ఉపాధ్యక్షులు బీచ్చాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం అక్కన్నపేట మండల కేంద్రం లో డి .ఏచ్.పి.ఏస్ రాష్ట్ర 2వ మహాసభల గోడ పత్రికలను అక్కన్నపేట మండల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు రాజ్యాంగ చట్టాలను దళితులకు వ్యతిరేకంగా అమలు చేస్తున్నారాని, దీనివలన తీవ్ర నష్టం పేదలకు జరుగుతుందని అన్నారు. డి.ఏచ్.పి.ఏస్ రాష్ట్ర 2వ మహా సభలు ఏప్రిల్ 17,18 న వరంగల్ నగరంలో జరుతున్నాయని ఈ మహాసభలను విజయవంతం చేయాలనీ పిలుపు నిచ్చారు. బహిరంగ సభకు అధిక సంఖ్యలో అక్కన్నపేట నుంచి దళితులు తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట దళిత హక్కుల పోరాట సమితి నాయకులు చుంచు కుమార్, టేకుల రమేష్, రాజ్ కుమార్, మాడుగుల రణధీర్, మేక అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండాకాలంలో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఎండాకాలంలో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్లను పంపిణీ చేశారు. కిట్లలో టోపీ, కళ్లజోడు, వాటర్ బాటిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మాస్కులు ఉన్నాయి. ఎండ ప్రభావం నుంచి రక్షణకు వీటిని వినియోగించాలని సూచించారు.సిబ్బంది పనితీరును ప్రశంసించిన ఎస్పీ, సమస్యలు ఉంటే తెలియజేయాలని అన్నారు. ఎక్కువగా నీళ్లు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణలో బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఆదినారాయణ, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే నేరుగా ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు

*** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏకశిల విద్యాలయంలో విద్యార్థులకు "ప్రాథమిక హక్కులు, విధులు" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది వై చెన్న మల్లారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచినటువంటి ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే పౌరులు నేరుగా రాష్ట్ర హైకోర్టు లేదా దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆశ్రయించవచ్చునని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు తమకు రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కు, సమానత్వపు హక్కు, స్వేచ్ఛా హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. హక్కులతో పాటు రాజ్యాంగం పట్ల గౌరవం, దేశ సమగ్రతను కాపాడటం వంటి ప్రాథమిక విధులను నెరవేర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. అనంతరం అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి రాజ్ కృష్ణ మాట్లాడుతూ ఏదైనా సమస్య ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహాయం ఎలా పొందాలో ఉదాహరణలతో ఉద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాలయ ప్రధానోపాధ్యాయులు డేవిడ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: 1929లో అసెంబ్లీపై బాంబు వేసి ఆనాటి కార్మిక చట్టాలను వ్యతిరేకించి నిలబడి పోరాడిన భగత్ సింగ్, బట్ కేసర్ దత్‌ల స్ఫూర్తితో నేడు నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. సీతారామయ్య పిలుపునిచ్చారు. జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం రైటర్ బస్తి నుండి బస్టాండ్ సెంటర్ వరకు నల్ల జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కొత్తగూడెం ఏరియా కార్యదర్శి ఎన్. సంజీవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీతారామయ్య మాట్లాడుతూ 1929లో తీసుకువచ్చిన ట్రేడ్ డిస్ప్యూట్ బిల్లు, పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ బిల్లులను వ్యతిరేకిస్తూ నాడు




భగత్ సింగ్, కార్మిక సంఘాలు అనేక పోరాటాలు నిర్వహించి మూడు కోట్ల పని దినాలను కోల్పోయారని గుర్తుచేశారు. 50 వేల మంది కార్మికులు నిరసన కార్యక్రమాలు తెలియజేశారు. అయినా పట్టించుకోని బ్రిటిష్ ప్రభుత్వం ఏప్రిల్ 8న పార్లమెంటులో ట్రేడ్ డిస్ప్యూట్ బిల్లు, పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ బిల్లు పేరుతో తీసుకొచ్చిన బిల్లుల్ని ఆపాలని భగత్ సింగ్, బట్ కేసర్ దత్ నాయకత్వంలో కేంద్ర అసెంబ్లీ సమావేశాలపై పొగ బాంబులు విసిరి బిల్లుల అమలును వ్యతిరేకించారన్నారు. నేడు స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పుకుంటూనే మన పాలకులు నరేంద్ర మోడీ ప్రభుత్వం చట్టాలను రద్దుచేసి ఇంకా కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు, కరుణ, సంధ్య, హుస్సేన్ బి, లక్ష్మీ, నరసింహారావు, రామకృష్ణ, కృష్ణ, నరసింహ, భగవాన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

*** ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ :రాష్ట్రంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ అసెంబ్లీలో ఎం.బి.సి కులాల అభివృద్ధి కార్పొరేషన్, నాయి బ్రాహ్మణ, రజక ఫెడరేషన్లు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ఆయన అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 36,526 మంది నాయి బ్రాహ్మణులు మాత్రమే ఉచిత విద్యుత్ లబ్ధి పొందుతుండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులందరికీ చేరకపోవడంపై ఆయన అధికారులను ప్రశ్నించారు. త్వరలోనే బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి నియోజకవర్గ స్థాయిల్లో బీసీ ఉప కులాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తామని, వారి ఆర్థిక స్థితిగతులపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంత రావు, పట్లోల సంజీవ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మాయాదేవి, సీఈఓ అలోక్ కుమార్, ఎండీలు మల్లయ్య భట్టు, ఇందిరా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కన్‌సాన్‌పల్లిలో సంబురంగా ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం



అందోలు,ప్రజాస్ఫూర్తి : పేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సాకరమవుతోందని ఏయంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు గృహ ప్రవేశాలు చేశారు. గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు ఆశం లక్ష్మీరవికి చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తెనుగు సునీత మహిపాల్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు గృహ ప్రవేశం చేశారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తిచేసుకొని గృహ ప్రవేశం చేపిన ఆశం లక్ష్మీరవి దంపతులు పలువురిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద వాడికి సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ తెనుగు సునీత, ఉప సర్పంచ్ పెంటయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్, మండల నాయకులు మొరబోయిన క్రిష్ణ, వార్డు సభ్యులు మహిపాల్, మోహన్, దేవునూరి లక్ష్మీసదానందం, కలపల్లి కవితప్రభు, వని రమాదేవి దుర్గేష్, మాజీ ఎంపిటీసి బాలయ్య, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరేశం, యువ నాయకులు బాల్‌రాజ్, పంతులు ఈశ్వర్, ఎం.ఈశ్వరయ్య, వని సత్తయ్య, చెక్రాల వెంకయ్య, రామన్నగారి నర్సింలు, తలారి యాదయ్య, వని మచ్చేందర్, దుర్గయ్య, చెంద్రయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అపార్ట్మెంట్స్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


*** మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: నేను సైతం*కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని 26వ వార్డులో యాదాద్రి ఎన్‌క్లేవ్ అపార్ట్మెంట్ లో 6 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారని టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో ఉపయోగపడతాయని అన్నారు.కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన అపార్మెంట్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై షాకీర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖమ్మం–కొత్తగూడెం గ్యాస్ పైపులైన్ వేగం పెంచాలి

**: కలెక్టర్ అంకిత్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం మధ్య సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజిడి) పైపులైన్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమీక్షలో పనుల పురోగతి, సమస్యలపై అధికారులతో చర్చించారు. మెగా డిస్ట్రిబ్యూటరీ సంస్థ క్వాలిటీ ఇంచార్జ్ రామకృష్ణతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రూట్ మ్యాప్, ప్రస్తుత స్థితి, ఎదురయ్యే సవాళ్లపై వివరాలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.భూసేకరణ, అనుమతులు, రోడ్ల తవ్వకాలు, ట్రాఫిక్ నియంత్రణలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, సింగిల్ విండో ద్వారా 24 గంటల్లో అనుమతులు ఇవ్వాలని తెలిపారు. డిగ్ అండ్ రీస్టోర్ విధానాన్ని వినియోగించాలని సూచించారు.జిల్లాలో ఎల్పీజీ కొరత నివారణకు పిఎన్జీ సరఫరాను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నోడల్ అధికారిగా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్‌ను నియమించారు. శాఖల సమన్వయ బాధ్యతలను పరిశ్రమల శాఖకు అప్పగించారు.సమావేశంలో పంచాయతీరాజ్ శ్రీనివాస్, ఆర్&బీ నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ మహేందర్, మిషన్ భగీరథ తిరుమలేష్, పంచాయతీ అధికారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణ కోసం
## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని అడిషనల్ ఎస్పి కోరారు. బుధవారం నల్లగొండ పట్టణంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల అమలు శబ్ద కాలుష్య, వాయు కాలుష్యం నియంత్రణలో భాగంగా పర్యావరణ రక్షణ కొరకు ప్రత్యేక చర్యలు చేపట్టారు . జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, ద్విచక్ర వాహనదారులు మాడిఫైడ్ సైలెన్సర్లు ఉపయోగించి అధిక శబ్దాలతో సౌండ్ పొల్యూషన్ సృష్టిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు.ఈ క్రమంలో సుమారు 72 ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్లను గుర్తించి వాటిని తొలగించి, నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ కూడలి వద్ద అడిషనల్ ఎస్పి రమేష్ ఆధ్వర్యంలో రోడ్ రోలర్ ద్వారా ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు కంపెనీ ద్వారా అందించిన ఒరిజినల్ సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. సైలెన్సర్లలో అనుమతి లేకుండా మార్పులు చేసి అధిక శబ్దం కలిగించే విధంగా ఉపయోగిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని హెచ్చరించారు. తిరిగి మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగించినట్లయితే, అట్టి వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను వినియోగించే వారిపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటూ, ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌ను కొనసాగిస్తారని తెలిపారు. జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణం.అలాగే ఎవరైనా అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తున్నట్లు గమనించినట్లయితే, సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, 2 టౌన్ సీఐ రాఘవ రావు,ట్రాఫిక్ సిఐ మహాలక్ష్మయ్య,1 టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, 2 టౌన్ ఎస్. ఐ సైదులు,రూరల్ ఎస్.ఐ సైదా బాబు, కనగల్ ఎస్. ఐ రాజీవ్ రెడ్డి,మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి చొరవ...
## ముస్తాబాద్ మండలానికి 4 బోర్ మోటార్లు మంజూరు

*** బీజేపీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ వెల్లడి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలానికి ఎంపీ నిధులతో 4 బోర్ మోటార్లు మంజూరు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ తెలిపారు. ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముస్తాబాద్ పర్యటనకు వచ్చిన సమయంలో, వేసవిలో ఎదురవుతున్న తాగునీటి కొరతను ఆయన దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి ఎంపీ ల్యాండ్స్ నిధుల ద్వారా వీటిని మంజూరు చేశారు. తెర్లుమద్ది గ్రామంలో ఒక బోర్, మొర్రాయిపల్లెలో ఒకటి, ముస్తాబాద్‌లో రెండు బోర్లను ఏర్పాటు చేస్తున్నారు. మొర్రాయిపల్లె గ్రామంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, సర్పంచ్ మెంగని శ్రీనివాస్ కొబ్బరి కాయ కొట్టి పనులు మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆవునూర్ సర్పంచ్ నక్కదాసరి రవీందర్, మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, కార్యదర్శి మీసా సంజీవ్ , మెరుగు అంజాగౌడ్, ఎదునూరి గోపి కుడుకల జనార్ధన్, వార్డు మెంబర్లు నామపూర్ తిరుపతి, గ్రామ ప్రజలు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా తెర్లుమద్ది గ్రామంలో మంచి నీటి కొరకు బోర్ వేయించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్, తెర్లుమద్ది సర్పంచ్ బైతి దుర్గమ్మ (నవీన్), సెక్రటరీ సౌజన్య, ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, వార్డు మెంబర్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజగౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, ఉపాధ్యక్షులు కాసోడి రమేష్, బట్టు దీప, బూత్ అధ్యక్షులు చిర్రం మహేష్, పల్లె తిరుపతి, సోషల్ మీడియా కోకన్వీనర్ ధను, బీజేపీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## పుష్కరాల నాటికి తొలి దశ పనులు పూర్తి చేయాలి

**– భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులపై ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సమీక్ష**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి మూడు దశలలో చేపట్టనున్న నేపథ్యంలో మొదటి దశ పనులను గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేసి, వచ్చే వారంలోనే నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవస్థానం అభివృద్ధి పనుల పురోగతిపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆర్కిటెక్ట్ కృష్ణమూర్తితో కలిసి బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, దేవస్థానం ఈవో దామోదర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనులను చేపడుతోందని తెలిపారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. పనుల ప్రారంభానికి ముందు నిత్యకళ్యాణ మండపం, దాసాంజనేయస్వామి మండపం, చిత్రకూట మండపం, దేవస్థానం కార్యాలయం, తూర్పు ప్రసాద కౌంటర్లు, మ్యూజియం, అద్దాల మండపం వంటి నిర్మాణాలను తొలగించాల్సి ఉండటంతోపాటు, ఆలయ నిత్య కార్యక్రమాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ భవనాల ఏర్పాటును వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పనులకు అవసరమైన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిర్దేశిత కాలవ్యవధిలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కరాల నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చుతూ, పుష్కర ఘాట్ల నిర్మాణం వంటి పనులను వేగవంతం చేయాలన్నారు.

## ప్రాజెక్టుల పంపులు, మోటార్లు పాడయ్యేలా కుట్ర జరుగుతోంది



హైదరాబాద్: కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీమంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ప్రాజెక్టుల్లోని భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. పంపులు, మోటార్లు పాడయ్యేలా కావాలనే ఈ కుట్ర జరుగుతోందని ఆరోపించి.. ఆ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారా..? అని ప్రశ్నించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు.

## ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఆర్టిజన్, అన్ మ్యాడ్ ఇన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం విద్యుత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులకు ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. బుధవారం సమ్మె శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 23,667 మందిని పర్మినెంట్ చేస్తానని జీవో పాస్ చేసి, ఇతర కార్మిక సంఘాల ద్వారా కోర్టులో కేసు వేయించి కార్మికులకు తీవ్ర నష్టం కలిగించారన్నారు. నాడు విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల దీక్షా శిబిరాల వద్దకు వచ్చిన నేటి పాలకులు సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ మంత్రి తక్షణమే ఆర్టిజన్ కార్మికుల నిరవధిక సమ్మెలో ఉన్న వారిని పిలిచి చర్చల ద్వారా వారి సమస్యలు పరిష్కరించాలని జమలయ్య డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మె ఉధృతంగా మారుతుందని హెచ్చరించారు.

## 33 వ వార్డులో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిడిపిఓ కు వినతి



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 33వ వార్డులో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ 33 వ వార్డు కౌన్సిలర్ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి ఆధ్వర్యంలో సిడిపిఓ శిరీష కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉండే మహిళలు, గర్భిణీ స్త్రీలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా సిడిపిఓ శిరీష 33 వ వార్డులో అంగన్వాడీ కేంద్రం,పట్టణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు శ్రావణ్,నీలం వెంకటేశ్వర్లు, గాదం ప్రసాద్,పడిదల కవిత, ఎండి హలీమా, జలీల్ ఖాన్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

*** ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, శ్రీరంగాపురం, వనపర్తి జిల్లా : ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన మండలాల్లో నూతన కార్యాలయ భవనాల ఏర్పాటుకు కృషి చేస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఘనంగా ప్రారంభించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయం పక్కనే రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహంలో ఏర్పాటుచేసిన గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ. 88 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు మౌలిక సదుపాయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన, భూమి పూజ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఈ భవనాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం కోసం ఒక్కో భవనానికి రూ.32 లక్షలను కలెక్టర్ తన సొంత నిధుల నుంచి కేటాయించి వేగంగా పూర్తి చేయించడం అభినందనీయమని తెలిపారు.

## కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం

* **అమ్ ఆద్మీ,జిల్లా అధ్యక్షుడు యార శ్రీను**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : అవినీతిని అంతం చేసి కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు వైద్యం అందే విధంగా పోరాటం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు యార శ్రీను పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదుకార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యారా శ్రీను మాట్లాడుతూ అమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు సైనికులు లాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అవినీతిని అంతం చేయడమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ పోరాటం చేస్తుందని అందుకు నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు సాగాలు ఉన్నారు. జిల్లాలో ఆమ్ ఆఫ్ ది పార్టీ సభ్యత్యాలను పెద్ద ఎత్తున చేర్పించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో అమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షలు యూసుఫ్,జిల్లా ప్రధాన కార్యదర్శి అద్దంకి రవి, శ్రవణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నల్లాలకు అక్రమ మోటార్లు బిగిస్తున్నారా..? చర్యలు తప్పవన్న జలమండలి



హైదరాబాద్: జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో జలమండలి తాగునీరు సరఫరా చేస్తోన్న సంగతి తెలిసిందే. అయితే చాలా మంది వినియోగదారులు నల్లాలకు అక్రమ మోటార్లు బిగిస్తూ.. మోతాదుకు మించి నీటిని తోడేస్తున్నారు. మిగతా వినియోగదారులకు లో ప్రెజర్‌తో నీటి సరఫరా జరుగుతోంది. ఇలా నల్లాలకు అక్రమంగా మోటార్లు వినియోగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జలమండలి హెచ్చరించింది. ఎస్ఆర్ నగర్ పరిధిలోని ఓ అండ్ ఎం డివిజన్ నంబర్ 6లో నల్లాకు అక్రమంగా మోటార్లు బిగిస్తున్నారని స్థానికులు జలమండలి విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో తనిఖీలు నిర్వహించి.. అక్రమంగా బిగించిన ఏడు మోటార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే.. వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది. ఒకవేళ తక్కువ ప్రెజర్‌తో నీరు సరఫరా అయినా.. లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. తమకు దగ్గర్లోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తారు.

## సామాన్యుడిలా మెట్రో రైల్లో ప్రయాణించిన మంత్రి జూపల్లి



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాద్ నగరవాసులను సర్‌ప్రైజ్ చేశారు. ఇవాళ ఉదయం సామాన్య ప్రయాణికుడిలా మెట్రో రైలులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి సాదాసీదాగా ఆయన మెట్రో ఎక్కారు. ఎర్రమంజిల్ స్టేషన్ నుంచి మియాపూర్ వరకూ మెట్రో రైలులో ప్రయాణించారు. మెట్రో స్టేషన్‌కు చేరుకున్న మంత్రి స్వయంగా టికెట్ తీసుకుని ప్లాట్‌ఫాంపైకి వెళ్లారు. రైలులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో తోటి ప్రయాణికులతో కలిసి నిలబడే ప్రయాణించారు. ఈ సందర్భంగా రైల్లోని ప్రయాణికులతో ఆయన ముచ్చటించారు. మెట్రో ప్రయాణంలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రితో పలువురు ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు. మంత్రి ఎంతో ఓపికగా వారితో ఫొటోలు దిగి ఉత్సాహపరిచారు. ట్రాఫిక్ చిక్కులు లేకుండా గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవడానికి మెట్రో ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా మంత్రి అభిప్రాయపడ్డారు.

## నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై హరీశ్ రావుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్



హైదరాబాద్: నాదర్‌గుల్‌లో భూములను 2014లోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంస్థలకు అప్పగించిందని, వారి హయాంలోనే ఆ సంస్థల పేరిట రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. నాడు జరిగిన రిజిస్ట్రేషన్‌తో తమ ప్రభుత్వానికేం సంబంధమని మండిపడ్డారు. నాదర్‌గుల్ భూములను తమ ప్రభుత్వం హయాంలో కట్టబెట్టినట్లు ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. తమకు నాలా కన్వర్షన్ ఇవ్వలేదని భూములు పొందినవారు 2022లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆ భూములు ప్రభుత్వానివేనని కౌంటర్ దాఖలు చేశామని వెల్లడించారు. నాడు వాటాల కోసం భూములు కట్టబెట్టిన వారు ఇప్పుడు తమపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారానికి సంబంధించిన కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. కాగా, నాదర్‌గుల్ భూముల వ్యవహారంపై ఇటీవల రాజకీయ దుమారం చెలరేగుతోంది. రూ.7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టిందని హరీశ్ రావు ఆరోపిస్తున్నారు.

# తల్లి ఆరోగ్యం కుటుంబం, సమాజ అభివృద్ధికి కీలకం

* **అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, సురక్షిత ప్రసవం, తల్లిశిశు సంక్షేమం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ తల్లి ఆరోగ్యం కుటుంబం, సమాజ అభివృద్ధికి కీలకమని తెలిపారు. గర్భిణీ స్త్రీలు గర్భధారణ ప్రారంభ దశలోనే నమోదు చేసుకొని, నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. కనీసం నాలుగు సార్లు ఆంటెనాటల్ చెకప్‌లు చేయించుకోవడం ద్వారా గర్భధారణలో వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రావు,మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని, దీనివల్ల తల్లి , శిశువు ప్రాణాలను రక్షించవచ్చని అన్నారు. తల్లి శిశు మరణాల శాతాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆధ్వర్యంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, కంబాలపల్లి, మల్యాల గ్రామాలకు చెందిన గర్భిణీ స్త్రీలను 102 అంబులెన్స్ వాహనాల ద్వారా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కు తీసుకువచ్చి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అవసరమైన రక్తపరీక్షలు, బీపీ పరీక్షలు,హీమోగ్లోబిన్ స్థాయిల పరిశీలన, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడ్డాయి. అలాగే పోషకాహారం ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ, ప్రసవానికి ముందు, తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్ర అవగాహన కల్పించారు. గైనకాలజిస్టులు డాక్టర్ రాధిక, డాక్టర్ శశి జోష్ణ మాట్లాడుతూ గర్భిణీలు 12 వారాల లోపు నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. 28 వారాల వరకు ప్రతి నెల, 28 నుండి 36 వారాల వరకు ప్రతి 15 రోజులకు ఒకసారి, 36 వారాల తరువాత ప్రతి వారం వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్లు డాక్టర్ వీరన్న,డాక్టర్ కరుణాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సారంగం, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సాగర్, హెల్త్ ఎడ్యుకేటర్లు కె.వి.రాజు, గీత, శారద, హెచ్ఈఓలు లోక్య, కే ఎల్ ఎన్ స్వామి,అనిల్ కుమార్,హరినాథ్ ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది , గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## అబద్ధాలతో అధికార పార్టీ.. నిద్రమత్తులో బీఆర్ఎస్ పార్టీ: కవిత



హైదరాబాద్: తెలంగాణ చరిత్రను మార్చే, భవిష్యత్తును తీర్చిదిద్దే పార్టీ ఈ నెల 25వ తేదీన వస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆవిర్భావం రోజు అద్భుతమైన ఎజెండా ప్రకటిస్తామని చెప్పారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయంతో తెలంగాణ భవిష్యత్తును మారుస్తామని.. దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు తెలంగాణ జాగృతిలో చేరారు. కవిత వారికి కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాగృతి తరపున ప్రశ్నిస్తాం... పోరాడతాం.. పరిష్కరిస్తామని తెలిపారు. వెలుగుమట్ల తరహాలో ప్రజల్లోనే ఉండి సమస్యలపై పోరాడతామని అన్నారు. ''బీఆర్ఎస్ పార్టీ అచేతన స్థితిలో ఉంది.. నిద్రపోతోంది. గద్వాలలో చేనేత, పత్తి రైతులకు అన్యాయం జరుగుతుంటే కూడా ప్రశ్నించడం లేదు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను వంచిస్తోంది. రాష్ట్ర పాలన మొత్తం ఢిల్లీ నుంచే జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారింది. ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తే జోగులాంబ జిల్లాలో తెలంగాణ జాగృతికి మొదటి విజయం దక్కింది. ఎమ్మెల్యే సీట్లలో మొదట గద్వాలలోనే విజయం సాధిస్తామని విశ్వాసం ఉంది. చూస్తుంటే గద్వాల గడీ మీద ఉద్యమకారుల జెండా ఎగురుతుందని అనిపిస్తోంది'' అని కవిత అన్నారు.

## సైబరాబాద్ పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ వార్షిక సమావేశం

### రూ.43 కోట్ల రుణాలు, 13% డివిడెండ్ ప్రకటన



హైదరాబాద్ : పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల ఆర్థిక భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న 'సైబరాబాద్ పోలీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్' (CPCCS) మూడో వార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం ఘనంగా జరిగింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో.. సొసైటీ ప్రెసిడెంట్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) డాక్టర్ ఎం.రమేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

* **రూ.10 తో మొదలై.. 100 కోట్ల టర్నోవర్‌కు**

సమావేశంలో సెక్రటరీ, ఎస్‌బీ ఏడీసీపీ ఎస్.రవికుమార్ స్వాగతోపన్యాసం చేస్తూ సొసైటీ చరిత్రను వివరించారు. 1951లో హైదరాబాద్ రూరల్ జిల్లాలో కేవలం 10 రూపాయల పెట్టుబడితో ఈ సొసైటీ ప్రారంభమైందని, నేడు దినదినాభివృద్ధి చెందుతూ రూ.100 కోట్ల భారీ టర్నోవర్ స్థాయికి చేరుకోవడం గర్వకారణమని ఆయన తెలిపారు.

* **గత ఏడాది సాధించిన ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలు**

ఉపాధ్యక్షురాలు, అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

* రుణాల మంజూరు: 681 మంది సభ్యులకు కేవలం 8.5 శాతం వడ్డీకే మొత్తం రూ.43,09,25,000 రుణాలను అందించారు.
* ఆర్థిక సాయం: దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు సభ్యుల కుటుంబాలకు, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తలా రూ. లక్ష చొప్పున సాయం అందజేశారు.
* స్కాలర్‌షిప్‌లు: 93 మంది సభ్యులకు చెందిన 105 మంది పిల్లల విద్యాభివృద్ధి కోసం రూ. 9.65 లక్షల స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు.
* రుణమాఫీ: మరణించిన నలుగురు సభ్యులకు సంబంధించిన రూ. 9,87,864 రుణాన్ని సొసైటీ పూర్తిగా మాఫీ చేసి వారి కుటుంబాలకు అండగా నిలిచింది.

* **పారదర్శకతకు మారుపేరు సీపీసీసీఎస్: సీపీ డా.రమేష్**

సమావేశంలో సీపీ డాక్టర్ ఎం. రమేష్ ప్రసంగిస్తూ.. సైబరాబాద్ పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికే పోలీస్ శాఖ ఎల్లప్పుడూ తొలి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా సిపీసీసీఎస్ అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నడుస్తోందని కొనియాడారు. సభ్యుల ఆర్థిక భద్రత, పొదుపు విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని అన్నారు. సొసైటీకి వచ్చిన ఆదాయపు పన్ను (ఇన్‌కమ్ టాక్స్) నోటీసుల విషయంలో ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకుని, త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని సీపీ హామీ ఇచ్చారు.

* **13% డివిడెండ్ ప్రకటన**

సమావేశంలో కోశాధికారి జి. మల్లేష్ ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ 13 శాతం డివిడెండ్‌ను ప్రకటిస్తూ తీర్మానాలను ప్రవేశపెట్టారు. కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ నుంచి హాజరైన అధికారిణి టి. రమాదేవి.. సంస్థ కార్యకలాపాలు, పనితీరు పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి (ఐపీఎస్), కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ (ఐపీఎస్), డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ట్రాఫిక్ డీసీపీ 1 రంజన్ రతన్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాదులో... ఏసీబీ వలకు చిక్కిన ఇద్దరు ఎయిర్ పోర్టు పోలీసు అధికారులు



హైదరాబాద్: శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) పోలీస్ అవుట్‌పోస్ట్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఓ కేసులో సహాయం చేసేందుకు లంచం తీసుకుంటున్న ఒక ఇన్‌స్పెక్టర్, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో చార్జిషీట్ వేయడానికి, ఫిర్యాదుదారుడి కుటుంబ సభ్యులను ఇరికించకుండా ఉండేందుకు ఇన్‌స్పెక్టర్ సంపత్ కనకయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్ యు.కె. సిద్ధేశ్వర్ రూ. 5 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ. 2 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుంటుండగా, రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఈ ఆపరేషన్ తర్వాత ఇన్‌స్పెక్టర్ కనకయ్య నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టగా భారీగా నగదు బయటపడింది. ఆయన ఇంట్లో రూ. 33.97 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు కొన్ని ఆస్తి పత్రాలు కూడా లభించాయని, వాటిపై విచారణ జరుపుతున్నామని ఏసీబీ తెలిపింది. విధులను దుర్వినియోగం చేసి అక్రమ లబ్ధి పొందారనే ఆరోపణలపై ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసి, నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ తెలిపారు. కాగా, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను ఏసీబీ గోప్యంగా ఉంచింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. మంగళవారం కూడా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ గోవర్ధన్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సీడ్ లైసెన్సు కోసం రూ. 1 లక్ష లంచం తీసుకుంటూ ఆయన పట్టుబడ్డారు.

## గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సరైన వైద్య సేవలు పొందాలి

* **జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి , రంగారెడ్డి జిల్లా: గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సరైన వైద్య సేవలు పొందాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవాలలో భాగంగా బుధవారం ఆరోగ్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల అధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఏర్పాటు చేసిన సురక్షిత మాతృత్వ దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వకాలంలో శారీరక వ్యాయామం ఉండేదని, కానీ మారుతున్న అలవాట్లకు అనుగుణంగా శారీరక వ్యాయామం తగ్గిందని, దీనికి తోడు మానసిక ఒత్తిడి ప్రతి ఒక్కరిలో పెరగడంతో చిన్న వయస్సులోనే వాధ్యులబారిన పడటం జరుగుచున్నదని అన్నారు. కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు సూచించారు.

## కేసీఆర్, హరీశ్ పిటిషన్లు.. పీసీ ఘోష్ కమిషన్ పై తీర్పు వాయిదా వేసిన హైకోర్టు




హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకల కేసును విచారించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. కమిషన్ భవితవ్యం ఏమిటన్నది తేల్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం మరికొంత సమయం తీసుకుంది. ఈరోజు ఈ వ్యవహారంపై వాదనలు విన్న చీఫ్ జస్టిస్ ధర్మాసనం, తుది తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ వివాదం 2024 మార్చిలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 6తో మొదలైంది. మేడిగడ్డ, అన్నారం వంటి బ్యారేజీల వైఫల్యాల వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీయాలని ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే, దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు స్మితా సభర్వాల్ వంటి కీలక అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందని, కనీసం తమ వాదనలు కూడా వినకుండా అభియోగాలు మోపుతున్నారని వారు తమ పిటిషన్లలో పేర్కొన్నారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం తన నిర్ణయాన్ని బలంగా సమర్థించుకుంది. ప్రజా ధనం దుర్వినియోగం అయిన ప్రాజెక్టులో నిజాలను నిగ్గుతేల్చడమే తమ లక్ష్యమని, ఇందులో ఎలాంటి రాజకీయ కక్షసాధింపులు లేవని స్పష్టం చేసింది. ఇప్పటికే రికార్డుల ఆధారంగా విచారణ జరిగిందని, అందరికీ నోటీసులు కూడా ఇచ్చామని కోర్టుకు వివరించింది. ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలు ముగిసినా, జడ్జిమెంట్ వాయిదా పడటంతో ఈ నెల 22వ తేదీ తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానుంది.

## ఆదిలాబాద్‌లో అతిపెద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణం

: **కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

ఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు సంబంధించి వస్తోన్న అన్ని డిమాండ్లను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డితో కలిసి రామ్మోహన్ నాయుడు సమావేశమయ్యారు. అనంతరం కిషన్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఫీజబులిటి ఉన్న చోట ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ''మామునూరు ఎయిర్‌పోర్టుకు మరో 3 నెలల్లో శంకుస్థాపన చేయాలని భావిస్తున్నాం. ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నాం. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు అంశంపై ఇవాళ కూడా కీలక చర్చ జరిగింది. ఆదిలాబాద్‌లో అతిపెద్ద ఎయిర్‌పోర్టు నిర్మించాలని కేంద్రం భావిస్తోంది. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు 300 ఎకరాల భూమి కూడా ఉంది. సివిల్ ఏవియేషన్‌తో కలిసి జాయింట్ వెంచర్‌కు సిద్ధంగా ఉన్నామని రక్షణ శాఖ చెప్పింది. సైన్యానికి శిక్షణతోపాటు సివిల్ ఏవియేషన్ అవసరాల కోసం వాడాలని రక్షణ శాఖ మంత్రి చెప్పారు.

# కాల్పుల విరమణ.. భారత్‌లో ఇంధన ధరలు తగ్గుతాయా?

ఢిల్లీ : పశ్చిమాసియాలో నెలరోజులకు పైగా కొనసాగుతోన్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికాఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మ్యూజ్ జలసంధి తిరిగి తెరుచుకోనుంది. దీంతో ఇటీవల భగ్గుమన్న చమురు ధరలు.. నేటి కాల్పుల విరమణ ప్రకటన తర్వాత అమాంతం దిగొచ్చాయి. మరి ఈ పరిణామాలతో భారత్‌లోనూ ఇంధన ధరలు తగ్గుతాయా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. యుద్ధం సమయంలో హర్మ్యూజ్‌ను ఇరాన్ మూసివేయడంతో చమురు సరఫరాకు ఆటంకం ఏర్పడింది. దీంతో క్రూడాయిల్ ధర వేగంగా పెరిగింది. ఈ ప్రభావం దేశీయంగానూ కొంతమేరకన్పించింది. చమురు కొరత ఏర్పడితే.. ఇంధన ధరలు పెరుగుతాయనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ భయాలను తగ్గించడానికే



కేంద్రం ఇటీవల ఇంధన దిగుమతులపై ఎక్సైజ్ డ్యూటీని భారీగా తగ్గించింది. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు కాల్పుల విరమణ ప్రకటించగానే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు దాదాపు 13-14 శాతం వరకు పడిపోయాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 95 డాలర్లకు దిగొచ్చింది. దీంతో దేశీయంగానూ చమురు ధరలు తగ్గుతాయనే భావన వ్యక్తమవుతోంది.

**భారత్‌పై ప్రభావం ఉంటుందా?**

ప్రపంచవ్యాప్తంగా హర్మ్యూజ్ జలసంధి నుంచి 20 శాతం చమురు రవాణా జరుగుతుంది. ఈ మార్గంలోనే గల్ఫ్ దేశాల నుంచి చమురు, గ్యాస్ నౌకలు భారత్‌కు చేరుకుంటాయి. ఇప్పటివరకు ఆందోళనల నేపథ్యంలో ఈ రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఇప్పుడు కాల్పుల విరమణతో నౌకల ప్రయాణం మొదలైతే దేశీయంగా ఇంధన కొరత భయాలు తగ్గినట్లే. కానీ, ఆ ప్రభావం రిటైల్ మార్కెట్లో కన్పించకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పటికే కొన్ని కంపెనీలు ముందుగానే చమురు కొనుగోలు చేసి నిల్వ ఉంచాయి. ఇప్పుడు అంతర్జాతీయంగా వీటి ధరలు తగ్గినా.. కంపెనీలు వాటిని రిటైల్ మార్కెట్లోకి బదిలీ చేసే అవకాశం తక్కువే. అయితే, సమీప భవిష్యత్తులో సామాన్య కష్టమర్లపై ధరల భారం పడకుండా ఈ కాల్పుల విరమణతో ఉపశమనం లభించనుంది. అయితే, చమురు ధరలు తగ్గితే పలు రంగాల్లో నిర్వహణ వ్యయాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. రవాణా ఖర్చులు తగ్గడం వల్ల ఆహార ద్రవ్యోల్బణం దిగిరావొచ్చు. సీజ్‌ఫైర్‌తో సానుకూల ప్రకటన రాగానే మార్కెట్‌లో అస్థిరత్వం తగ్గింది.

**మరింతకాలం గందరగోళమే..**

హర్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరిచినా.. చమురు సరఫరా ఇంతకు ముందులా జరగాలంటే ఇంకాస్త సమయం పడుతుంది. బీమా, రవాణా ఖర్చులు అధికంగా ఉండటం వల్ల నౌకలు ఈ మార్గంలో ప్రయాణించేందుకు సంకోచిస్తాయి. ఈ కాల్పుల విరమణ తాత్కాలికమే కాబట్టి.. మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకునే భయాలూ వెంటాడుతాయి. 'సీజ్‌ఫైర్' ఇలాగే కొనసాగి, హర్మ్యూజ్ జలసంధి మీదుగా చమురు రవాణా మునుపటి స్థాయికి చేరుకునే దాన్ని బట్టి.. దేశీయంగా ఇంధన ధరలు ఆధారపడి ఉంటాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పశ్చిమబెంగాల్ ఎన్నికలు..
# మమత నామినేషన్ దాఖలు

కోల్‌కతా, ఏప్రిల్ 8: పశ్చిమబెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గం భవానీపూర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. తన జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. నామినేషన్ వేయడానికి ముందు కాళీఘాట్ లోని నివాసం నుంచి అలీపుర్ సర్వే భవనం వరకు ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆమె ఇక్కడ నామినేషన్ పత్రాలను సమర్పించారు.



ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. 'నేను పుట్టింది, పెరిగింది భవానీపుర్‌లోనే. నా జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైంది' అని వ్యాఖ్యానించారు. మొత్తం 294 స్థానాల్లోనూ టీఎంసీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో భాగంగా.. పలువురి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడంపై మమత ఆందోళన వ్యక్తంచేశారు. 'ఓటర్ల జాబితా నుంచి అనేకమంది పేర్లను తొలగించడం నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఓటరు తుది జాబితా ఇంకా ఎందుకు విడుదల చేయలేదో నాకు అర్థంకావడం లేదు. దీనికి వ్యతిరేకంగా మేం మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం' అని అన్నారు. భవానీపుర్ నుంచి మమత మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దీదీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి భాజపా తన అభ్యర్థిగా సువేందు అధికారిని బరిలోకి దింపింది. ఇక, బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

# ఎన్నికల సంఘం-టీఎంసీ సమావేశంలో రసాభాస

కోల్‌కతా, ఏప్రిల్ 8 : బెంగాల్‌లో నేడు తృణమూల్ కాంగ్రెస్ బృందంఎన్నికల సంఘం మధ్య జరిగిన సమావేశం (ECTMC meet) లో రసాభాస నెలకొంది. ఏడు నిమిషాల పాటు జరిగిన సమావేశం అనంతరం ఇరు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. సమావేశం అనంతరం టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరెక్ మీడియాతో మాట్లాడుతూ..ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాసిన లేఖను తాము ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు అందజేశామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్నికల అధికారులకు భాజపాతో సంబంధాలున్న నిర్దిష్ట ఉదంతాలను ఆయన ముందు లేవనెత్తామన్నారు. దీంతో ఎన్నికల సంఘం అధిపతి ఆగ్రహంతో తమను సమావేశం నుంచి బయటకు వెళ్లిపొమ్మన్నారని




ఆరోపించారు. మరోవైపు టీఎంసీ నేతల సమావేశంలో ఓ ఎంపీ అరుస్తూ గందరగోళం సృష్టించారని ఈసీ ఆరోపించింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతున్న సమయంలో టీఎంసీ ఎంపీ ఇతర ఎన్నికల కమిషనర్లపై కేకలు వేస్తూ.. ఆయనను మాట్లాడకుండా అడ్డుకున్నారని తెలిపింది. బెంగాల్‌లో ఎటువంటి హింసాత్మక ఘటనలు, బెదిరింపులు, ప్రలోభాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

**తృణమూల్ పార్టీకి ఈసీ అల్టిమేటం**


టీఎంసీ అధికారిక బృందంతో సమావేశం అనంతరం ఆ పార్టీకి ఎన్నికల సంఘం అల్టిమేటం జారీ చేసింది. ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని సూచించింది. ఓటింగ్ సమయంలో బూత్ క్యాప్చరింగ్, బూత్ జామింగ్ వంటి ఓటర్లకు అంతరాయం కలిగించే చట్టవిరుద్ధమైన చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించింది.

## నాలుగు రోజులు మిస్సింగ్..
# కేరళ టెకీ ట్రెక్కింగ్ స్టోరీపై అనుమానాలు..!

కొడగు (కర్ణాటక) : కేరళకు చెందిన శరణ్య అనే యువతి కర్ణాటకలో ట్రెక్కింగ్‌కు వెళ్లి తప్పిపోయిన విషయం తెలిసిందే. కర్ణాటక ప్రభుత్వం భారీ సెర్చ్ ఆపరేషన్‌తో ఎట్టకేలకు నాలుగు రోజుల తర్వాత ఆమె ఆచూకీ లభ్యమైంది. అయితే, ఆ యువతి చెప్పిన వివరాలపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ ఘటన ఫేక్ అంటూ పలువురు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంపై భాజపా నాయకులు కర్ణాటకలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ''ట్రెక్కింగ్‌కు వెళ్లిన శరణ్య గురించి సామాజిక మాధ్యమాల వేదికగా కొన్ని కథనాలు వైరల్ అవుతున్నాయి. వాటిని బట్టి చూస్తే పలు



అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు లొంగకుండా, ఈ విషయంపై దర్యాప్తు చేపట్టాలి. ఆమె కోసం ప్రజల సొమ్మును వృథా చేసి డ్రోన్లు, జాగిలాలు, అటవీశాఖ సిబ్బందితోపాటు ప్రత్యేక బలగాలతో ముమ్మరంగా గాలించి ఆచూకీ తెలుసుకున్నారు. అందువల్ల అసలు విషయం ఏంటో తెలుసుకోవాలనుకుంటున్నాం'' అని కొడగు జిల్లాలోని భాజపా(BJP) నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ''ఆ అమ్మాయి ఆచూకీ లభ్యం అయిన వెంటనే తనతో మాట్లాడాను. ఆమె చెప్పిన దాన్నిబట్టి చూస్తే అనుమానించడానికి కారణాలు ఏం లేవు. కానీ ఇప్పుడు కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ కోణంలో ఆమెని విచారించి అసలు ఏం జరిగిందో తెలుసుకుంటాం'' అంటూ రెస్క్యూ బృందంలో పాల్గొన్న ఓ పోలీసు అధికారి వివరించారు. ఏప్రిల్ 2న ట్రెక్కింగ్‌కు వెళ్లిన బృందం నుంచి తప్పిపోయిన శరణ్య ఆచూకీ ఏప్రిల్ 5న లభించింది. తేలికపాటి ట్రెక్కింగే కాబట్టి తనతో పాటు ఎలాంటి ఆహారం తీసుకెళ్లలేదని, ఈ నాలుగురోజుల పాటు రోజుకి 3 లీటర్ల నీళ్లను మాత్రమే తాగి గడిపానని ఆమె తెలిపారు. అయితే సోషల్ మీడియాలో ఈ ట్రెక్కింగ్ సమాచారం గురించి తెలుసుకున్నవారు 'ఇది నమ్మశక్యంగా లేదు. నాలుగు రోజుల పాటు ఆహారం లేకుండా ఉన్నా కూడా ఆమె ఇంత ఉత్సాహంగా ఎలా ఉంది. దీని వెనక ఏదో పెద్ద కథే ఉంది. అడవిలో జంతువుల మధ్య నాలుగు రోజులు జీవించడం అనేది అసాధ్యం' అంటూ కామెంట్లు పెడుతున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# అమెరికా ఇరాన్ సీజ్‌ఫైర్ .. స్పందించిన భారత్

న్యూఢిల్లీ: ఏప్రిల్ 8 : అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ పై భారత్ స్పందించింది. ఈ సీజ్‌ఫైర్‌ను ఇరుదేశాలు అంగీకరించడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయంతో పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నట్లు విదేశాంగ శాఖ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 'అమెరికా ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించడాన్ని మేం స్వాగతిస్తున్నాం. ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుందని ఆశిస్తున్నాం. ఉద్రిక్తతలను తగ్గించడం, నిరంతరం సంప్రదింపులు జరపడం, దౌత్యం ద్వారానే ఈ సంఘర్షణకు ముగింపు లభిస్తుందని మేము ఇంతకుముందే స్పష్టంచేశాం. ఈ యుద్ధం వల్ల ఇప్పటికే ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రపంచ ఇంధన సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగింది. తాజా ఒప్పందం నేపథ్యంలో హర్మ్యూజ్ జలసంధి మీదుగా నౌకల రవాణాకు ఏ ఆటంకం ఉండదని ఆశిస్తున్నాం' అని విదేశాంగ శాఖ పేర్కొంది. దాదాపు 40 రోజులుగా అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర పోరు కొనసాగింది. దీనికి అడ్డుకట్ట వేస్తూ.. కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. హర్మ్యూజ్‌ను తిరిగి తెరిచేందుకు, ఈ కాల్పుల విరమణకు ఇరాన్ కూడా అంగీకారం తెలిపింది.

# ఇరాన్ ఒప్పందం ఉల్లంఘిస్తే
# పరిణామాలు తీవ్రంగా ఉంటాయి: జేడీ వాన్స్ హెచ్చరిక


బుడాపెస్ట్, ఏప్రిల్ 8: అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల తర్వాత కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గంటల వ్యవధిలోనే ఒత్తిడికి గురవుతోందని అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది చాలా 'బలహీనమైన ఒప్పందం' అని, టెహ్రాన్‌లోని అంతర్గత విభేదాల కారణంగా ఇది ఏ క్షణంలోనైనా విఫలం కావచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బుడాపెస్ట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ వాన్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ తమను నిజాయతీగా చర్చలు జరపమని ఆదేశించారని, అయితే తమ సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. "వారు నిజాయతీగా చర్చలు జరిపితే, మేం కచ్చితంగా ఒక విస్తృత ఒప్పందాన్ని కుదుర్చుకోగలుగుతాం. కానీ, వారు అబద్ధాలు చెప్పినా, మోసం చేసినా.. దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి" అని వాన్స్ హెచ్చరించారు. అవసరమైతే తమ వద్ద స్పష్టమైన సైనిక, దౌత్య, అసాధారణ ఆర్థిక పరపతి ఉందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతానికి ఈ సంధి ఒక స్వల్పమైన దౌత్యపరమైన అవకాశాన్ని మాత్రమే కల్పించిందని, చర్చల్లో ఇరాన్ ఎలా వ్యవహరిస్తుందనే దానిపైనే తదుపరి దశ ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కొన్ని గంటల క్రితమే కుదిరిన ఈ ఒప్పందం కేవలం ఘర్షణలకు తాత్కాలిక విరామం మాత్రమేనని, దీని భవిష్యత్తుపై అనిశ్చితి కొనసాగుతోందని ఆయన అన్నారు. "ఈ ఒప్పందం కుదిరి కేవలం 8 నుంచి 12 గంటలు మాత్రమే అయింది. అందుకే ఇది బలహీనమైన సంధి అని నేను చెబుతున్నాను" అని వాన్స్ వివరించారు. ప్రపంచ వాణిజ్యానికి ఆటంకం కలిగిస్తున్న కీలకమైన నౌకా మార్గాలను తిరిగి తెరవాలని, ఘర్షణ పూరిత చర్యలను నిలిపివేయాలని అమెరికా ఇచ్చిన అల్టిమేటం తర్వాతే ఈ ఒప్పందం కుదిరింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు చర్చలు జరిపినట్లు వాన్స్ తెలిపారు. "కీలక జలమార్గాలను తెరవండి, మేం కాల్పుల విరమణకు సిద్ధమవుతాం అని అధ్యక్షుడు స్పష్టంగా చెప్పారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, వ్యూహాత్మక జలమార్గాల గుండా నౌకల రాకపోకలను పునరుద్ధరించడానికి ఇరాన్ అంగీకరించింది. దీనికి బదులుగా, అమెరికా, దాని మిత్రదేశాలు సైనిక దాడులను నిలిపివేశాయి. అయితే, కాల్పుల విరమణకు ముందే అమెరికా తన సైనిక లక్ష్యాన్ని సాధించిందని వాన్స్ స్పష్టం చేశారు. "ఇరాన్ సైనిక శక్తిని నిర్వీర్యం చేయడమే మా అధ్యక్షుడి లక్ష్యం. ఆ లక్ష్యం ఇప్పటికే నెరవేరింది" అని అన్నారు. ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరాన్ నాయకత్వంలోని భిన్నాభిప్రాయాలు పరిస్థితిని క్లిష్టతరం చేస్తున్నాయని వాన్స్ ఆందోళన వ్యక్తం చేశారు.



"ఇరాన్‌లో కొందరు ఈ ఒప్పందాన్ని సానుకూలంగా స్వాగతిస్తుంటే, మరికొందరు మాత్రం మేం సాధించిన దాని గురించి, ఒప్పందం స్వభావం గురించి పూర్తిగా అబద్ధాలు చెబుతున్నారు. కాల్పుల విరమణపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని ఆరోపించారు. ఈ అంతర్గత వైరుధ్యాలే సంధి బలహీనంగా ఉండటానికి ప్రధాన కారణమని, జాగ్రత్తగా వ్యవహరించకపోతే అది విఫలమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# పోలింగ్‌కు ముందే.. టీవీకేకు ఎదురు దెబ్బ

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న వేళ.. సినీ నటుడు విజయ్ పార్టీ టీవీకేకు తొలి షాక్ తగిలింది. పోటీ చేయకుండానే ఒక స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఆ పార్టీ అభ్యర్థి దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురి కావడమే దీనికి కారణం. ఎడప్పాడి శాసనసభ స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్‌కు ప్రపోజర్ల సంతకాలు సరిపోలేదు. దీంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఈ నియోజకవర్గం నుంచి విజయ్ పార్టీ తరపున బరిలోకి దిగిన అరుణ్ కుమార్ నామినేషన్‌ను అధికారులు పరిశీలించారు. అయితే, నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న ప్రపోజర్ల వివరాలు ధ్రువీకరించలేకపోవడంతో రిటర్నింగ్ అధికారి ఆ దరఖాస్తును తిరస్కరించారు. ప్రధాన



అభ్యర్థితో పాటు ఆ పార్టీ వేసిన ప్రత్యామ్నాయ అభ్యర్థి నామినేషన్ కూడా ఇదే కారణంతో తిరస్కరణకు గురి కావడం గమనార్హం. మాజీ సీఎం, ఏఐఏడీఎంకే కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వరుసగా ఆరోసారి విజయం సాధించేందుకు సిద్ధమయ్యారు. అధికార పార్టీ డీఎంకే నుంచి సి కాశీ బరిలోకి దిగారు. వీరిద్దరి నామినేషన్లు ఆమోదం పొందాయి. ఈ నెల 23న తమిళనాడు ఎన్నికలు జరగనున్నాయి.

## భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్..
### ఒక్క రోజే రూ.17 లక్షల కోట్ల లాభం



**ముంబై:** ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం భారతీయ స్టాక్ మార్కెట్‌కు లాభాలపంట పండించింది. ఇన్వెస్టర్లకు భారీ లాభాలు తెచ్చిపెట్టింది. బుధవారం, ఎస్ అండ్ పీ బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 2,946.32 పాయింట్లు లాభపడి, 77,562.90 పాయింట్ల వద్ద ముగిసింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా ఏకంగా 873.35 పాయింట్లు పెరిగి, 23,997.35 పాయింట్ల వద్ద ముగిసింది. ఏకంగా ఈ ఒక్కరోజే 4 శాతం లాభాలతో మదుపర్ల సంపద రూ.17.1 లక్ష కోట్ల వరకు పెరిగింది.

దీంతో మొత్తం మార్కెట్ విలువ రూ.445.8 లక్షల కోట్లకు చేరింది. ఉదయం ప్రారంభం నుంచి మార్కెట్ లాభాల్లోనే నడిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 77,627.15 కోట్ల గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 24,025.15 పాయింట్ల గరిష్ట స్థాయికి చేరింది. ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గనుండటం వంటి పరిణామాలు మార్కెట్‌కు అనుకూలంగా మారాయి. అలాగే, కీలక వడ్డీ రేట్లను ఆర్బీఐ యథాతథంగా ఉంచడం కూడా కలిసొచ్చింది. ఇండియన్ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయ మార్కెట్లు కూడా ఈ రోజు లాభాలబాటపట్టాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి 6 శాతం, జపాన్ నిక్కీ 5 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 3 శాతం లాభాపడ్డాయి.

మరోవైపు డాలర్‌తో రూపాయి మారక విలువ 47 పైసలు పెరిగి, 92.59 వద్ద కొనసాగుతోంది. కాల్పుల విరమణ ఒప్పందంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గిపోయాయి. అంతకుముందు రోజు బ్యారెల్ క్రూడాయిల్ ధర దాదాపు 109 డాలర్ల వద్ద ఉండగా, బుధవారం భారీగా తగ్గి 94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దాదాపు 16 శాతం పైగా చమురు ధర తగ్గింది. ఔన్స్ బంగారం ధర 4788 డాలర్ల వద్ద స్థిరపడింది. ఈ రోజు షేర్లలో ఇండిగో ఏకంగా పది శాతం మేర లాభాలు పొందింది.

## మే నెలలో 14 వేల మంది ఉద్యోగుల తొలగింపు ప్రచారం..
### స్పందించిన అమెజాన్




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ వచ్చే మే నెలలో దాదాపు 14 వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ఆసియా బిజినెస్ ఔట్ లుక్ వెల్లడించింది. అయితే, ఓ ఆంగ్ల మీడియా ఛానల్‌తో అమెజాన్ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ, ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. ఇలాంటి అసత్య ప్రచారం విశ్వసించవద్దని కోరారు.

మే నెలలో చేపట్టనున్న ఈ తొలగింపుల్లో అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటైల్‌తో పాటు మానవ వనరుల విభాగాలలోని ఉద్యోగులపై ప్రభావం పడనుందని నివేదికలు తెలిపాయి. 2025 చివరి నాటికి ఈ సంస్థ 14 వేల మంది ఉద్యోగులను తొలగించగా, ఈ ఏడాది జనవరిలో 16 వేల మందికి ఉద్వాసన పలికింది. అయితే మరో విడత తొలగింపు అంటూ వచ్చిన వార్తలను అమెజాన్ ఖండించింది.

## మే నుంచి హ్యుందాయ్ కార్ల ధరలు పెంపు..
### 1% వరకు భారం!







**న్యూఢిల్లీ:** ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా తమ కార్ల ధరలను పెంచుతున్నట్లు బుధవారం అధికారికంగా ప్రకటించింది. ముడిసరుకులు, ఇతర ఉత్పత్తి వ్యయాలు పెరగడమే ఇందుకు కారణమని తెలిపింది. పెంచిన ధరలు 2026 మే 1 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో అన్ని మోడళ్లపై గరిష్టంగా 1 శాతం వరకు భారం పడనుంది.

ఈ ఏడాదిలో హ్యుందాయ్ తమ వాహనాల ధరలను పెంచడం ఇది రెండోసారి కావడం గమనార్హం. పెరుగుతున్న ఇన్ పుట్ ఖర్చులు, లాజిస్టిక్స్ వ్యయాల భారాన్ని వీలైనంత వరకు తామే భరిస్తున్నామని వెల్లడించిన కంపెనీ.. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఈ స్వల్ప పెంపును వినియోగదారులకు బదిలీ చేస్తున్నామని ఒక ప్రకటనలో వివరించింది. ఎంచుకునే మోడల్ మరియు వేరియంట్‌ను బట్టి ఈ ధరల పెరుగుదలలో తేడాలు ఉంటాయని స్పష్టం చేసింది.

ప్రస్తుతం ఆటోమొబైల్ రంగంలో ఉక్కు, అల్యూమినియం వంటి కీలక లోహాల ధరలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రభావంతో ఇతర కార్ల కంపెనీలు కూడా ధరల పెంపు దిశగా యోచిస్తున్నాయి. కాగా, హ్యుందాయ్ ఇటీవలే మార్చి నెలలో 55,064 యూనిట్ల విక్రయాలతో అత్యధిక దేశీయ అమ్మకాలను నమోదు చేయడం విశేషం.

## ఉత్కంఠ పోరులో
# ఢిల్లీ ఓటమి
### ఒక్క పరుగు తేడాతో గెలిచిన గుజరాత్...

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026లో మరో ఉత్కంఠభరిత మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ పోరులో గుజరాత్ టైటాన్స్ కేవలం ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై థ్రిల్లింగ్ విజయం సాధించింది. చివరి ఓవర్‌లో ఢిల్లీ విజయానికి 13 పరుగులు అవసరమైన దశలో, బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేసి గుజరాత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.






చివరి ఓవర్ తొలి బంతికే విప్రాజ్ నిగమ్ ఫోర్ కొట్టడంతో ఢిల్లీ గెలుపు ఖాయమనిపించింది. కానీ, తర్వాతి బంతికే నిగమ్‌ను ఔట్ చేసిన ప్రసిద్ధ్, మ్యాచ్‌ను గుజరాత్ వైపు తిప్పాడు. నాలుగో బంతిని డేవిడ్ మిల్లర్ సిక్సర్‌గా మలచడంతో సమీకరణం 2 బంతుల్లో 2 పరుగులుగా మారింది. ఐదో బంతికి పరుగు రాకపోవడంతో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. చివరి బంతికి 2 పరుగులు అవసరం కాగా, మిల్లర్ షాట్ మిస్ అవ్వగా.. పరుగు కోసం ప్రయత్నించిన కుల్దీప్ రనౌట్ కావడంతో గుజరాత్ సంబరాల్లో మునిగిపోయింది.

211 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ చివరి వరకు పోరాడింది. కేఎల్ రాహుల్ (52 బంతుల్లో 92) అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును గెలుపు అంచుల వరకు తెచ్చాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (20 బంతుల్లో 41) మెరుపులు మెరిపించినా ఫలితం లేకపోయింది. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 17 పరుగులిచ్చి 3 వికెట్లతో ఢిల్లీని దెబ్బకొట్టాడు. అంతకుముందు, గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 210 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (70), జోస్ బట్లర్ (52), వాషింగ్టన్ సుందర్ (55) అర్ధ సెంచరీలతో జట్టుకు భారీ స్కోరు అందించారు.

## బుమ్రాలోనూ భయం పుట్టించాడు
### వైభవ్ సూర్యవంశీపై డేల్ స్టెయిన్ ప్రశంసలు



**న్యూఢిల్లీ:** రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తన దూకుడైన బ్యాటింగ్‌తో బౌలర్లపై మానసికంగా ఆధిపత్యం చెలాయిస్తున్నాడని, చివరికి జస్‌ప్రీత్ బుమ్రా లాంటి మేటి బౌలర్లను కూడా తప్పిదాలు చేసేలా ఒత్తిడికి గురిచేస్తున్నాడని దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ ప్రశంసించాడు. సూర్యవంశీ బౌలర్ల గుండెల్లో భయాన్ని నింపుతున్నాడని ఆయన అభిప్రాయపడ్డాడు.

మంగళవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా వేసిన తొలి బంతినే సూర్యవంశీ మిడ్-ఆన్ మీదుగా బౌండరీ తరలించిన విషయాన్ని స్టెయిన్ గుర్తుచేశాడు. "బుమ్రా వేసిన ఆ బంతి స్లాట్‌లో పడింది. బుమ్రా నుంచి ఇలాంటి బంతి రావడం చాలా అరుదు. 'తప్పు చేస్తే సిక్స్ కొడతాడు' అని బుమ్రా మదిలో కూడా మెదిలి ఉంటుంది. అలా అనుకున్నప్పుడు చాలాసార్లు పొరపాట్లు జరుగుతాయి. సరిగ్గా అదే జరిగింది," అని స్టెయిన్ వివరించాడు.

సూర్యవంశీకి భయం లేదని, ఎదురుగా ఉన్న బౌలర్ ఎవరైనా సరే, చెత్త బంతి వేస్తే శిక్షించడం ఖాయమని స్టెయిన్ అన్నాడు. "ఆ కుర్రాడికి భయమంటే తెలియదు. బౌలర్ బుమ్రా అయినా, సాధారణ బౌలర్ అయినా సరే.. బంతి మిస్ అయితే బౌండరీ దాటాల్సిందే. ఇది అద్భుతమైన బ్యాటింగ్" అని కొనియాడాడు.

గౌహతిలో వర్షం కారణంగా కుదించిన ఈ మ్యాచ్‌లో, యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ తొలి వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం అందించారు. సూర్యవంశీ కేవలం 14 బంతుల్లో 39 పరుగులు చేయగా, జైస్వాల్ 32 బంతుల్లో 77 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్‌లో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది.

## దిగ్గజ క్రికెటర్ రవిశాస్త్రికి
# అరుదైన గౌరవం



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ దిగ్గజం, టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రికి ముంబై క్రికెట్ అసోసియేషన్ అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. ముంబైలోని ఐకానిక్ వాంఖడే స్టేడియంలోని ఒక స్టాండ్‌కు ఆయన పేరు పెట్టాలని నిర్ణయించింది.

వాంఖడే స్టేడియంలోని ప్రెస్ బాక్స్ కింద ఉన్న లెవల్ 1 స్టాండ్‌కు 'రవిశాస్త్రి స్టాండ్' అని పేరు పెట్టనున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఆటగాడిగా, కెప్టెన్‌గా, కోచ్‌గా, వ్యాఖ్యాతగా ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఎంసీఏ ఈ నిర్ణయం తీసుకుంది.

ఈ వేడుకలో రవిశాస్త్రితో పాటు ముంబైకి చెందిన మరికొందరు క్రికెట్ దిగ్గజాల పేర్లను స్టేడియం గేట్లకు పెట్టనున్నారు. మహిళా క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ పేరును గేట్ నంబర్ 5కు పెట్టనున్నారు. దివంగత బ్యాటింగ్ దిగ్గజం దిలీప్ సర్దేశాయ్ పేరును గేట్ నంబర్ 3కి కేటాయించారు. అద్భుతమైన ఫీల్డర్‌గా పేరుగాంచిన ఏకనాథ్ సోల్కర్ గౌరవార్థం గేట్ నంబర్ 6కు ఆయన పేరు పెట్టనున్నారు. రేపు నిర్వహించే ఈ భారీ ఆవిష్కరణ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్య అతిథిగా హాజరై... ఈ స్టాండ్, గేట్లను అధికారికంగా ప్రారంభిస్తారు. ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ ఆధ్వర్యంలో ఈ వేడుక జరగనుంది.

రవిశాస్త్రి ముంబై తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకే ఓవర్‌లో 6 సిక్సర్లు కొట్టిన రికార్డుతో పాటు, 1983 ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడిగా కూడా ఉన్నారు. తన కెరీర్‌లో 80 టెస్టులు, 150 వన్డేలు ఆడి దాదాపు 7 వేల పరుగులు, 280 వికెట్లు తీశాడు.

## ముంబయి ఓటమి..
# బౌలర్లే కారణం

### హార్దిక్ పాండ్య

**న్యూఢిల్లీ:** ఈ ఐపీఎల్ సీజన్‌లో ముంబయి ఇండియన్స్ వరుసగా రెండో మ్యాచ్ ఓడిపోయింది. మంగళవారం రాత్రి రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ పాండ్య జట్టు పూర్తిగా తేలిపోయింది. ఈ ఓటమికి పూర్తి బాధ్యత బౌలింగ్ యూనిట్‌దేనని ముంబయి కెప్టెన్ పాండ్య తెలిపాడు. కనీసం ఐదు మంచి బంతులేసినా తమకు గెలిచే ఛాన్స్ ఉండేదన్నాడు.

"మా జట్టు ఓటమిలో బ్యాటర్ల తప్పేం లేదు. లక్ష్యం ఎక్కువగా ఉండటంతో మొదటి బంతి నుంచే మాకు భారీ షాట్లు ఆడాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, మేం బౌలింగ్‌లోనే సరిగ్గా రాణించలేదు. నాతో సహా మా బౌలింగ్ బృందం విఫలమైంది. ఈ ఓటమికి బౌలింగ్ యూనిట్‌దే బాధ్యత. కనీసం ఐదు బంతులైనా సిక్సర్లు వెళ్లకుండా కట్టడి చేయాల్సింది. అప్పుడు ముంబయి పోరాడేందుకు అవకాశం లభించేది" అని పాండ్య తెలిపాడు.

కుర్రాళ్లు కుమ్మేశారు.. రాజస్థాన్ హ్యాట్రిక్ విజయం

"రాజస్థాన్ జట్టు గొప్పగా ఆడింది. ఆ జట్టు ఓపెనర్లు తొలి రెండు ఓవర్లలోనే గేమ్‌ను మా నుంచి లాగేసుకున్నారు. ఆ తర్వాత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు మేం ప్రయత్నించినా.. వెనకబడిపోయాం"



అని హార్దిక్ వివరించాడు. వర్షం కారణంగా 11 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో ముంబయి 27 పరుగుల తేడాతో ఓడిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 3 వికెట్లకు 150 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబయి సీనియర్ బౌలర్లు బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, శార్దూల్ ఠాకుర్, దీపక్ చాహర్ తేలిపోయారు. ధారాళంగా పరుగులిచ్చేశారు. ఛేదనలో పాండ్య సేన 123 పరుగులకే పరిమితమైంది.

MOVIE TIME




# అల్లు అర్జున్ మూవీ పేరు రాకా !

## టైటిల్ రిలీజ్ చేసిన చిత్ర బృందం

**టాకీస్:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబోతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఆయన ఏదో 'వేర్-బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# నా జీవితంలో ఒక బ్రేకప్ ఉంది

## కృతి శెట్టి

టాకీస్: 'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టి, 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా విడుదలకు సిద్ధమైంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్లలో ఈ ఇద్దరు సెలబ్రిటీలు తమ బ్రేకప్స్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాయి.

కృతి శెట్టి మాట్లాడుతూ... తనకు గతంలో ఒకసారి బ్రేకప్ జరిగిందని వెల్లడించింది. ఈ విషయం తన తల్లికి కూడా తెలుసని, ప్రస్తుతం మాత్రం తాను సింగిల్‌గా ఉన్నానని స్పష్టం చేసింది. అలాగే సోషల్ మీడియాలో తనపై నెగిటివిటీ ప్రచారం చేసే వారిని ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే బ్లాక్ చేస్తానని ఆమె క్లారిటీ ఇచ్చింది.


ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ... తన లైఫ్ లో ఒకటి కాదు, చాలా బ్రేకప్స్ జరిగాయని నవ్వుతూ చెప్పాడు. అవతలి వాళ్లే తనను బ్లాక్ చేశారని నిజాయతీగా ఒప్పుకున్నాడు. కాలేజీ రోజుల్లో అమ్మాయిల మెసేజ్‌లకు తాను చాట్ జీపీటీ కంటే వేగంగా రిప్లై ఇచ్చేవాడినని, అంతలా కష్టపడినా చివరకు సింగిల్‌గానే మిగిలిపోయానని సరదాగా వ్యాఖ్యానించాడు.

# ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు ర్యూమర్స్

## వదంతులను తోసిపుచ్చిన చిత్ర బృందం



**టాకీస్:** ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక్ వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకున్నారంతే. దయచేసి ఎవరూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.




# 'ది ప్యారడైజ్' ఫస్ట్ సింగిల్ సంచలనం..

## 100 మిలియన్ వ్యూస్‌తో రికార్డు సృష్టించిన 'ఆయా షేర్'!

టాకీస్: నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న మాస్ పీరియడ్ డ్రామా 'ది ప్యారడైజ్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలను మరింత పెంచుతూ తాజాగా విడుదలైన మొదటి సింగిల్ 'ఆయా షేర్' సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ఈ పాట విడుదలైన కొద్ది రోజుల్లోనే 100 మిలియన్ వ్యూస్ మార్క్‌ను దాటి అరుదైన రికార్డు సృష్టించింది. సినిమా విడుదలకు ముందే ఈ స్థాయి వ్యూస్ సాధించడం విశేషం. ముఖ్యంగా నాని కెరీర్‌లోనే సినిమా రిలీజ్ కాకముందే 100 మిలియన్ వ్యూస్ దాటిన తొలి పాటగా 'ఆయా షేర్' నిలిచింది.

ఇంకా ఒక విశేషం ఏమిటంటే, అత్యంత వేగంగా ఈ ఘనతను అందుకున్న ట్రాక్‌లలో ఇది ఒకటిగా నిలవడం. దీంతో ఈ పాట మ్యూజిక్ చార్ట్‌లను షేక్ చేస్తోంది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన మాస్ బీట్స్ ఈ పాటకు ప్రధాన బలం కాగా, నాని ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ పాటలోని హుక్ స్టెప్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో అభిమానులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ స్టెప్‌ను రీక్రియేట్ చేస్తూ వీడియోలు షేర్ చేస్తున్నారు. దీంతో 'ఆయా షేర్' మరింత వైరల్ అవుతోంది.

ఈ పాటను భారీ సెట్‌లో, స్లమ్ బ్యాక్‌డ్రాప్‌లో ఎంతో రిచ్‌గా చిత్రీకరించారు. విజువల్స్‌లో నాని రగ్గడ్ లుక్, హై-ఎనర్జీ బీట్స్‌కు పర్ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతూ మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఇక 'ది ప్యారడైజ్' చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌తో హైప్ పెరిగిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో అన్న ఆసక్తి సినీ ప్రియుల్లో నెలకొంది. 'ఆయా షేర్' సాంగ్ సక్సెస్‌తో 'ది ప్యారడైజ్'పై అంచనాలు మరింత పెరిగాయి.

# పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న బైకర్

టాకీస్: టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'బైకర్' బాక్సాఫీస్ వద్ద అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా, విడుదలైన ఐదు రోజుల్లోనే ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచే స్థాయిలో వసూళ్లు రాబడుతోంది. సాధారణంగా ఏ సినిమా అయినా వీక్‌డేస్‌లో కలెక్షన్లు తగ్గుముఖం పడతాయి. కానీ 'బైకర్' విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. రోజు రోజుకూ ఈ సినిమా పుంజుకుంటూ ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ మౌత్ టాక్ ఈ చిత్రానికి పెద్ద ప్లస్‌గా మారింది. ఆన్‌లైన్ బుకింగ్స్ కూడా ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సోమవారం రోజు బుక్‌మైషోలో సుమారు 15.6 వేల టిక్కెట్లు అమ్ముడవ్వగా, మంగళవారం ఈ సంఖ్య 17.2 వేలకు పెరగడం విశేషం. భారీ పోటీ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ స్పోర్ట్స్ డ్రామాపై చూపిస్తున్న ఆసక్తి సినిమా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర తెరకెక్కించగా, ప్రముఖ నిర్మాణ




సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించింది. సినిమాలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించగా, సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. అలాగే అతుల్ కుల్కర్ణి కూడా తన నటనతో ఆకట్టుకున్నారు. ఇక సంగీత దర్శకుడు జిబ్రాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకు మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా రేసింగ్ సీక్వెన్స్‌లలో ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడుతోందని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. కొత్త కాన్సెప్ట్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎలిమెంట్స్ కలగలిపిన 'బైకర్' ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటూ బాక్సాఫీస్ వద్ద విజయపథంలో దూసుకుపోతోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా మరింత భారీ వసూళ్లు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.